www.akshratimes.com
తెలుగు దినపత్రిక
# అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
RNI.NO : APTEL/2022/90211
సంపుటి : 03 సంచిక : 364 పేజీలు : 08, వెల రూ. 1 రూ/ www.akshratimes.com సోమవారం 13 - 04 - 2026
Published by ANANTAPURAM : Circulated in Anantapuram, Satya Sai, Vijayavada, Ysr Kadapa, Annamayya, Prakasham, Bapatla,Ntr, Karimnagar,Gunturu,East Godavari, West Godavari, Kakinada, Eluru, Sri Potti Sriramulu Nellore, Kurnool


ఇరాన్‌తో శాంతి చర్చలు విఫలం.. ఇక మిగిలింది కూడా ముగించేస్తామన్న ట్రంప్

# రైజింగ్ అమరావతి

- భవిష్యత్తులో పెట్టుబడులు ఇంకా పెరుగుతాయని రైతుల ఆశాభావం
- రాజధానిపై కూటమి ప్రభుత్వ చర్యలతో మంచి ఫలితాలు
- చాలా వేగంగా జరుగుతోన్న అమరావతి పనులు
- వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో దెబ్బతిన్న అమరావతి ప్రతిష్ఠ
- అమరావతి బ్రాండ్‌ను చంద్రబాబు పునరుద్ధరిస్తున్నారన్న రాజధాని రైతులు



**అమరావతి :**

రాజధానికి రాజముద్రతో అమరావతిపై కమ్ముకున్న మబ్బులు తొలగిపోయాయి. గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం తీసుకున్న 3 రాజధానుల వంటి నిర్ణయాలు ఎవరూ చేయకుండా అమరావతికి రాజ్యాంగబద్ధమైన రక్షణ లభించింది. ఫలితంగా రాజధాని అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆలోచిస్తున్న వారికి కూడా నమ్మకం కలిగింది. నిర్మాణ పనులు పట్టాలెక్కడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సానుకూల ధోరణి, చట్టబద్ధమైన గుర్తింపు రావడంతో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు - మిగతా 2 లో

# వైజాగ్‌లో ఐబీఎం..

- ఫోటో షేర్ చేసిన మంత్రి నారా లోకేశ్
- విశాఖపట్నంలో కార్యకలాపాలు ప్రారంభించనున్న ఐబీఎం
- ఆరేళ్ల విరామం తర్వాత తిరిగి వైజాగ్‌కు వస్తున్న టెక్ దిగ్గజం
- మొదటగా 500 మందికి పైగా ఉద్యోగాలు కల్పించే అవకాశం
- రూ.321 కోట్ల ఎగుమతులు లక్ష్యంగా ఐబీఎం ప్రణాళిక
- ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించాయని మంత్రి నారా లోకేశ్ వెల్లడి

**విశాఖపట్నం :**

ఆంధ్రప్రదేశ్ ఐటీ రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ సంస్థ ఐబీఎం విశాఖపట్నంలో తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఈ మేరకు వైజాగ్ లో ఐబీఎం సంస్థ బోర్డు తాలూకు ఫొటోను రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఐబీఎంకు వైజాగ్ తరపున స్వాగతం అంటూ పోస్టు చేశారు. ఐబీఎం రాకతో విశాఖ ఐటీ స్వరూపం - మిగతా 2 లో




# శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్




- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- తెలంగాణ పరిధిలో 45.35 కి.మీ. కాగా ఏపీలో 41.39 కి.మీ.
- హైవే విస్తరణకు ఇబ్బందులకు పరిష్కారంగా పైనుంచి వెళ్లే వంతెనకు ప్రతిపాదన
- ఈ ప్రాజెక్టుకు రూ.18,500 కోట్లు అవుతుందని అంచనా

# చర్చలు విఫలం..

- ఏం జరగబోతోందనే టెన్షన్ లో పశ్చిమాసియా
- యుద్ధం మళ్లీ మొదలవుతుందని విశ్లేషకుల అంచనా
- హర్మూజ్ జలసంధి మళ్లీ మూతపడనుందనే ఆందోళనలు
- రంగంలోకి ఇరాన్ మిత్ర దేశాలు.. నేరుగా మద్దతు!



**ఢిల్లీ :**

పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన సుదీర్ఘ శాంతి చర్చలు విఫలమయ్యాయి. పాకిస్థాన్ లోని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ స్పీకర్ ఘాలిబాఫ్ బృందాల మధ్య 21 గంటల పాటు చర్చలు జరిగాయి. అయితే, ఎలాంటి ఒప్పందం కుదరకుండానే అర్ధాంతరంగా - మిగతా 2 లో

# 2029లోపే మహిళా రిజర్వేషన్లు



- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- మద్దతు కోరుతూ పార్టీలకు ప్రధాని మోదీ లేఖ
- మహిళా రిజర్వేషన్ల అమలుపై ప్రధాని మోదీ ప్రత్యేక దృష్టి
- 2029 ఎన్నికలలోపే అమలు చేసేందుకు సన్నాహాలు
- మద్దతు కోరుతూ పార్టీల ఫ్లోర్ లీడర్లకు ప్రధాని లేఖ
- ఈ నెల 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు
- 2011 జనాభా లెక్కల ఆధారంగా రిజర్వేషన్ల ప్రతిపాదన

**ఢిల్లీ :**

చట్టసభల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు కల్పించే "నారీశక్తి వందన్ అధినియం" (మహిళా రిజర్వేషన్ బిల్లు) అమలు దిశగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక ముందడుగు వేశారు. 2029 సార్వత్రిక ఎన్నికలలోపే మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు వీలుగా, ఈ బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని కోరుతూ లోక్‌సభ, రాజ్యసభలోని అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లకు ఆయన లేఖ రాశారు. ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ బిల్లుపై చారిత్రక చర్చ జరగనుందని, దీని ఆమోదానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందడం ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తుందని ప్రధాని తన లేఖలో పేర్కొన్నారు. "ఏప్రిల్ 16 నుంచి నారీశక్తి వందన్ అధినియంపై పార్లమెంట్‌లో చారిత్రక చర్చ జరగనుంది. ఇది - మిగతా 2 లో

# దివికేగిన లెజెండరీ గాయని ఆశా భోంస్లే

- ముంబై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- కన్నీళ్లతో ప్రకటించిన భోంస్లే కుమారుడు, మనవరాలు
- సోమవారం శివాజీ పార్క్ లో అంత్యక్రియలు
- 20కి పైగా భాషల్లో 12,000 పాటలు పాడిన గాన దిగ్గజం





## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల
# అమ్మాయిలదే హవా!




- తెలంగాణ ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు 2026 విడుదల
- ఫస్టియర్‌లో 66.20%, సెకండియర్‌లో 70.58% మంది ఉత్తీర్ణత
- ఫలితాల్లో మరోసారి సత్తా చాటిన అమ్మాయిలు
- అధికారిక వెబ్‌సైట్లతో పాటు వాట్సాప్ ద్వారా కూడా ఫలితాల వెల్లడి
- ఉత్తీర్ణులు కాని విద్యార్థులకు మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

**హైదరాబాద్ :**

లక్షలాది మంది విద్యార్థుల ఉత్కంఠకు తెరపడింది. తెలంగాణ ఇంటర్మీడియట్ ఫస్టియర్, సెకండియర్ వార్షిక పరీక్షల ఫలితాలు-2026 విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంబంధాల సలహాదారు కె. కేశవరావు, - మిగతా 2 లో




# బటన్ నొక్కితే కారు నంబర్ ప్లేట్ చేంజ్

- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ బీఎండబ్ల్యూ కారు
- చలాన్ల నుంచి తప్పించుకోవడానికే ఈ మోసం
- యజమానిపై చీటింగ్, ఫోర్జరీ కేసులు నమోదు

## రాష్ట్రంలో కాంగ్రెస్ 'దోచుకో-దాచుకో'
# పథకం నడిపిస్తోంది

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కేటీఆర్ తీవ్ర విమర్శలు
- సీఎం రేవంత్ రెడ్డి దేశంలోనే అత్యంత అవినీతిపరుడైన సీఎం అంటూ కేటీఆర్ ఫైర్
- తెలంగాణలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చీకటి దోస్తీ చేస్తున్నాయంటూ వ్యాఖ్యలు
- సింగరేణిలో అవినీతి ఆపకపోతే ప్రతి బొగ్గు గనిపై అగ్గిపుట్టిస్తామని హెచ్చరిక
- సింగరేణి కుంభకోణంపై కేంద్రం విచారణ జరపడం లేదని ఆగ్రహం



**హైదరాబాద్ :**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 'దోచుకో-దాచుకో' అనే కొత్త పథకాన్ని ప్రారంభించిందని, ముఖ్యమంత్రి నుంచి మంత్రులు, ఎమ్మెల్యేల వరకు అందరూ అవినీతి, దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో క్యాతనపల్లి మున్సిపాలిటీకి ఎన్నికైన బీఆర్ఎస్ కౌన్సిలర్ల అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి అంతటి భారీ అవినీతిపరుడైన ముఖ్యమంత్రి దేశంలోనే మరొకరు లేరని ఘాటుగా విమర్శించారు.కాంగ్రెస్, బీజేపీలు తోడుదొంగల్లా మారి ఒకరినొకరు కాపాడుకుంటున్నాయని కేటీఆర్ ఆరోపించారు. - మిగతా 2 లో

# సంపాదకీయం

## న్యాయం నిలిచింది!




మా కుటుంబానికి ఏం జరుగుతోందోనని భయంగా ఉంది అన్నమాట ఒక పోలీసు నోట వినబడటం ఆశ్చర్యం. సాతాంకుళం కేసులో కీలకసాక్షిగా వ్యవహరించిన రేవతి తనను ప్రశంసలతో ముంచెత్తుతున్న మీడియాతో ఇదేమాట చెబుతోంది. ఒక సంచలనాత్మకమైన తీర్పుకు ప్రధాన కారకురాలైన ఆమెను రాబోయే రోజుల్లో తన కుటుంబానికి రక్షణ ఉండదేమోనన్న అనుమానం పీడిస్తోంది. తొమ్మిదిమంది పోలీసు సిబ్బందికి జీవితఖైదుతో సరిపెట్టకుండా, ఏకంగా మరణశిక్ష విధించిన మదురై కోర్టు తీర్పు ఎంత సంచలనం సృష్టించిందో, అంతటి శిక్షకు కొండంత సాయం చేసిన హెడ్‌కానిస్టేబుల్ రేవతి కూడా దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. అన్యాయాన్ని ప్రతిఘటించే ఆమె స్థైర్యానికీ, బెదిరింపులకు ఏ మాత్రం లొంగని ఆమె ధైర్యసాహసాలకు దేశం మురిసిపోతోంది.కొవిడ్ కాలంలో నిబంధనలను ఉల్లంఘించి దుకాణం తెరిచారన్న పేరిట తండ్రీకొడుకులను అరెస్టుచేసి, పోలీసు స్టేషన్‌లో వేధించి, హింసించి, రాత్రంతా లాఠీదెబ్బలతో ప్రాణాలు తీసిన ఆ భయానకమైన ఘట్టం దేశాన్ని కుదిపేసింది. కొట్టిచంపేయడంతో పాటు సాక్ష్యాలను మాయం చేయడానికి ఆ పోలీసులు చేసిన ప్రయత్నాలు, జాగ్రత్తలు న్యాయమూర్తిని ఆశ్చర్యపరిచాయి. అత్యంత అరుదైన కేసు అంటూ ఆయన చేసిన వ్యాఖ్య, తీర్పులో భాగంగా అలవోకగా చేసింది కాదు. మనసు లోతుల్లోంచి వచ్చింది అది. 'నువ్వు చావాల్సిందే.. ఒకవేళ నేను జైలుకెళ్ళాల్సి వస్తే, నా ఆస్తి మొత్తం అమ్మి బయటకు వచ్చేస్తా' అన్నాడట సబ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణన్ బెనిక్స్‌ను లాఠీతో కొడుతూ. వాళ్ళ ఆర్తనాదాలు నాకు వినిపించడం లేదేమి? అంటూ మరో ఇన్‌స్పెక్టర్ రెచ్చగొట్టాడట. నేలమీద పడిన రక్తపు మరకలను బాధితుడితో అతడి బనీను విప్పించి మరీ తుడిపించారట. రాత్రంతా పోలీసు స్టేషన్‌లో కొడుతూనే ఉన్నారని, అనేకసార్లు లాకప్ హింస చూసిన, ఆర్తనాదాలు విన్న తాను జయరాజ్, బెనిక్స్‌ను తోటి పోలీసులు పెడుతున్న హింసను చూసి తట్టుకోలేకపోయానని రేవతి కన్నీరు పెట్టుకున్నారు. కస్టడీ హింసకూ, పోలీసుల అమానుషత్వానికీ పరాకాష్ఠ ఈ ఘటన. కుమారుడు చావుదెబ్బలు తిని కన్నుమూసిన ఘోరాన్ని కళ్ళారా చూసిన ఆ తండ్రి మర్నాడు తానూ ఆ దెబ్బల తాకిడికి ప్రాణాలు కోల్పోయాడు. ప్రజాగ్రహంతో రంగంలోకి దిగిన సీబీఐకి రేవతి, మరో కానిస్టేబుల్ పని సులభం చేశారు. ఐదేళ్ళపాటు అన్ని ఆధారాలనూ పరిశీలించి, వందకు పైగా సాక్షులనూ విచారించిన మదురై కోర్టుకు ఇవి లాకప్ మరణాలని నిర్ధారించడంలో మరో సందేహమే లేకపోయింది. ఈ కఠిన శిక్ష విధించడంతో పాటు, బాధిత కుటుంబాలవారికి నష్టపరిహారంగా చెల్లించేందుకు కోటిన్నర రూపాయలు జరిమానాగా వేయడం సముచితం. చట్టాన్ని రక్షించాల్సిన వారు ప్రాథమిక సూత్రాలనూ నియమాలనూ తుంగలోతొక్కి, హద్దులులేని క్రూరత్వంతో ఆ ఇరువురి ప్రాణాలను హరించి, పౌరుడికీ రాజ్యానికీ మధ్య ఉన్న బంధాన్నీ, ఒప్పందాన్నీ తుంచేసినందుకు ఈ మాత్రం అవసరం.ఇటువంటి ఘటనలకు తావులేని వ్యవస్థలను, నివారించగల విధానాలను ఎందుకు సృష్టించుకోలేకపోతున్నామన్నది ప్రశ్న. ఉన్నవీ, అమలు చేయాల్సినవీ కూడా ఉద్దేశపూర్వకమైన ఉల్లంఘనలకు గురవుతున్నందునే నిర్లజ్జగా, నిరంతరంగా లాకప్ హత్యలు సాగుతున్నాయి. తన భద్రతను, వృత్తినీ, ఉనికినీ ప్రమాదంలోకి నెట్టి, ఏ మాత్రం బంధుత్వంలేని ఇద్దరు వ్యక్తులకు దక్కాల్సిన అంతిమన్యాయం కోసం నిలబడి పోరాడే రేవతివంటివారు అత్యంత అరుదు. తనతో కలిసి పనిచేసినవారి ఒత్తిళ్ళనూ, తన పైవారి ఆదేశాలనూ ధిక్కరించి, తారుమారైన సాక్ష్యాలను తిరగదోడడంలోనూ, మాటుగా ఉన్నవాటి గుట్టురట్టుచేయడంలోనూ, చెరిపేసినవాటిని చిత్రీకరించడంలోనూ ఆమె చూపిన సాహసం అసామాన్యమైనది. సాక్ష్యాలను తుడిపేసి, సాక్షుల నోళ్ళు మూయించడం పోలీసులకు సులభమైపోతున్నది కనుకనే, ఠాణాల్లో జరిగే అమానుషాలు వెలుగుచూడటం లేదు. అందువల్ల, ఒత్తిళ్ళకు ఎదురొడ్డి, సత్యరక్షణకు కట్టుబడిన రేవతి వంటి ఒకరిద్దరిపై కేసులూ న్యాయమూ పూర్తిగా ఆధారపడటం సరికాదు. పోలీసుస్టేషన్లలో సీసీటీవీల ఏర్పాటు, అవి నిరంతరాయంగా పనిచేయడం, సత్వరమే ఎఫ్ఐఆర్‌ల నమోదు, సాక్ష్యాలూ, సాక్షుల పరిరక్షణ, స్వతంత్ర దర్యాప్తు, బెదిరింపులకు తావులేకుండా చేయడం వంటివి కలగలిసినప్పుడే పోలీసుల దురాగతాలకు హద్దు ఉంటుంది, కస్టడీ మరణాలకు కళ్ళెం వేయడం సాధ్యపడుతుంది.

## వైజాగ్‌లో ఐబీఎం..

**మొదటిపేజీ తరువాయి** – మరింత బలోపేతం అవుతుందని ఆయన గతంలో పేర్కొన్నా సంగతి తెలిసిందే.దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత ఐబీఎం తిరిగి విశాఖకు వస్తోంది. ఇందుకోసం సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్ ఆఫ్ ఇండియాలో ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తన కార్యకలాపాల కోసం ఇప్పటికే నమోదు చేసుకుంది. ఈ కేంద్రం ద్వారా తొలుత 500 మందికి పైగా ఉద్యోగులకు ఉపాధి లభించనుంది. రాబోయే మూడేళ్లలో సుమారు రూ. 321 కోట్ల విలువైన ఎగుమతులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం.రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చాలన్న ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. గత జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్.. ఐబీఎం సీఈవో అరవింద్ కృష్ణతో సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరించారు. ఆ చర్చల ఫలితంగానే ఇప్పుడు ఐబీఎం విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకొచ్చినట్లు తెలుస్తోంది.గతంలో మధురవాడ ఐటీ సెజ్‌లో ఐబీఎంకు కార్యాలయం ఉండేది. ఇప్పుడు మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించడం ద్వారా విశాఖను కీలక ఐటీ గమ్యస్థానంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ప్రయత్నాలకు మరింత బలం చేకూరింది.

## చర్చలు విఫలం..

**మొదటిపేజీ తరువాయి** – ముగిశాయి. పశ్చిమాసియాలో అమలవుతున్న రెండు వారాల కాల్పుల విరమణ గడువు ముగియడానికి ముందు చోటుచేసుకున్న ఈ పరిణామంతో ఇకముందు ఏం జరగనుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**మూడు ఆప్షన్ లు..**

చర్చలు విఫలమవడంతో మూడు ప్రధాన పరిణామాలు చోటుచేసుకోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మొదటిది.. కాల్పుల విరమణ ముగిసిన వెంటనే మళ్లీ యుద్ధం ప్రారంభం కావడం. ఇప్పటికే ఇరాన్ తన క్షిపణులను సిద్ధం చేసుకుందన్న సమాచారంతో అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు అప్రమత్తమయ్యాయి. ఇది ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉంది.

రెండోది.. ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిని దిగ్బంధించడం. ఇది ఇరాన్ చేతిలో ఉన్న శక్తిమంతమైన అస్త్రం. దీనిని ప్రయోగిస్తే అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగిపోతాయి.మూడోది.. చైనా వంటి దేశాలు ఇరాన్‌కు బహిరంగంగా సైనిక మద్దతు పలకడం. ఈ పరిణామాలు అంతర్జాతీయంగా ఉద్రిక్తతలను మరింత పెంచే అవకాశం ఉంది.

**పట్టువీడని ఇరు దేశాలు..**

చర్చల సందర్భంగా తమపై విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని ఇరాన్ పట్టుబట్టగా, హర్మూజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత రవాణాకు హామీ ఇవ్వడంతో పాటు చైనా నుంచి ఆయుధాలు తీసుకోవడం ఆపాలని అమెరికా షరతు విధించింది. తమ తమ డిమాండ్ల విషయంలో రెండు దేశాలు వెనక్కి తగ్గకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. శాంతి ప్రయత్నాలు బెడిసికొట్టడంతో ఇప్పుడు అందరి దృష్టి కాల్పుల విరమణ తర్వాత పశ్చిమాసియాలో జరగబోయే పరిణామాలపైనే కేంద్రీకృతమై ఉంది.

## దివికేగిన లెజెండరీ గాయని ఆశా భోంస్లే

**మొదటిపేజీ తరువాయి** – భారతీయ సంగీత ప్రపంచంలో ఓ శకం ముగిసింది. సుప్రసిద్ధ గాయని ఆశా భోంస్లే ఇక లేరు. తీవ్ర అస్వస్థతతో శనివారం ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చేరిన ఆశా భోంస్లే.. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. శనివారం తీవ్రమైన నీరసం, ఛాతీలో ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు ఐసీయూకి తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆమె మరణ వార్తను కుమారుడు ఆనంద్ భోంస్లే, మనవరాలు జానై భోంస్లే ధృవీకరించారు.ఆమె పార్థివ దేహాన్ని సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అభిమానుల సందర్శనార్థం ఆమె నివాసంలో ఉంచనున్నారు. అనంతరం, సాయంత్రం 4 గంటలకు ముంబైలోని శివాజీ పార్కులో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.దిగ్గజ గాయని లతా మంగేష్కర్ కు ఆశా భోంస్లే స్వయానా సోదరి. బ్రిటీష్ ఇండియాలోని సాంగ్లీ స్టేట్ లో 1933 సెప్టెంబర్ 8న జన్మించారు. 1943లో ఆమె తన సంగీత ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎనిమిది దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో 20కి పైగా భాషల్లో 12,000కు పైగా పాటలు పాడి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ (2011)లో స్థానం సంపాదించారు. తెలుగులో కూడా ఆమె పాడిన ఎన్నో పాటలు విశేష ప్రజాదరణ పొందాయి. ఆమె మరణం భారత సంగీత ప్రపంచానికి తీరని లోటు.

# రైజింగ్ అమరావతి

**మొదటిపేజీ తరువాయి** – పెట్టడానికి సానుకూల వాతావరణం ఏర్పడింది. ఈ పరిణామాలపై రాజధాని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.జగన్ కారణంగా దెబ్బతిన్న అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ని పునరుద్ధరించి, పెట్టుబడిదారుల్లో విశ్వాసం నెలకొల్పేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్నచర్యలు మంచి ఫలితాలనిచ్చాయి. ముఖ్యంగా అమరావతి చట్టబద్ధత బిల్లుపై పార్లమెంటు ఉభయసభలు రెండింటిలోనూ ఆమోదం పొందడంతో పాటు గెజిట్ కూడా విడుదల అయ్యింది. కేంద్రం, రాష్ట్రంలోనూ ఒకే కూటమి అధికారం ఉన్నాయి. దీంతో ఢిల్లీ అమరావతి బిల్లుపై ఆశించిన స్థాయిలో మద్దతు కూడాలభిస్తోంది. ఇది పెట్టుబడిదారుల్లో భరోసా నింపింది. ఎటుచూసినా రాజధాని పనులు జరుగుతుండడం వల్ల అమరావతి ప్రాంతం జీవకళను సంతరించుకుంటోంది. 20 వేలకు పైగా కార్మికులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు.

**తుదిమెరుగు దిద్దుకుంటున్నా భవనాలు:** ఏడంతస్తుల సీఆర్డీఏ భవనాన్ని, దానిపక్కనే మరో 4 భవనాలను ప్రీఫ్యాబ్రికేటెడ్ విధానంలో నిర్మించారు. సీఆర్డీఏ, ఏడీసీలతో పురపాలక శాఖ విభాగాలు అన్నీ అమరావతి నుంచే పని చేస్తుండటం గమనార్హం. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, గెజిటెడ్ అధికారులు, సివిల్ సర్వెంట్లు, ఎన్జీవోలు, నాలుగవ తరగతి ఉద్యోగుల కోసం అపార్ట్‌మెంట్ టవర్ల నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. న్యాయమూర్తులు, మంత్రులు, ఉన్నతాధికారుల బంగ్లాల నిర్మాణాలు పూర్తియ్యాయి. ప్రస్తుతం వీటికి తుదిమెరుగు దిద్దుకుంటున్నాయి. ప్రధాన రహదారులతో పాటు జలాశయాలు, కాలువల నిర్మాణ పనులు మరింత వేగం పుంజుకున్నాయి.

**అమరావతి నిర్మాణాన్ని ఇక ఎవరూ ఆపలేరు:**

ఐకానిక్ భవనాలుగా నిర్మిస్తున్న శాసనసభ, హైకోర్టు, సచివాలయం, హెచ్‌ఓడీ కార్యాలయాల టవర్లను రెండు సంవత్సరాలలోగా పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ భవనాన్ని 50 ఎకరాల్లో నిర్మిస్తున్నారు. ఈ భవనాన్ని 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయనున్నారు. వాటి కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఇప్పటికే గడువు కూడా నిర్దేశించారు. అమరావతి నిర్మాణాన్ని ఇక ఎవరూ ఆపలేరన్న నమ్మకాన్ని బ్యాంక్‌లు, రుణ వితరణ సంస్థలు, పెట్టుబడిదారుల్లో కలిగించాయి. అమరావతిలో రూ.44,600 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు జరిగింది. ఈ సదస్సులో పలు సంస్థలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.2014 నుంచి 2019 మధ్య ప్రభుత్వ, ప్రభుత్వరంగ, ప్రైవేటు సంస్థలు భూములు తీసుకున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఒకేరోజు 15 బ్యాంకులకు సంబంధించిన కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలకు ప్రభుత్వం మరో 100 ఎకరాలు చొప్పున కేటాయించింది. దీంతో విస్తరణ ప్రణాళికలు కూడా అమలు చేస్తున్నాయి. భవిష్యత్తులో పెట్టుబడులు ఇంకా పెరుగుతాయనే భరోసా రైతుల్లో వ్యక్తమవుతోంది.

**మరిన్ని నిధులు సమకూర్చుకోవాలి:** రాజధానికి తీసుకునే రుణాలు ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా కేంద్ర ప్రభుత్వం మినహాయింపులు ఇచ్చింది. ఇప్పటికే బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి మొత్తంగా రూ.40,887 కోట్లు రుణం అందింది. మరో రూ.1,500 కోట్లు, ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి మరో రూ.14 వేల కోట్లు రుణానికి ప్రతిపాదనలు పంపించారు. రైతులకు స్థలాలు కేటాయించారు. మిగిలిన భూముల్ని విక్రయిస్తున్నారు. ఇప్పటికే బాండ్లు వంటి మార్గాల్లో మరిన్ని నిధులు సమకూర్చుకోవాలని సీఆర్డీఏ తలపోస్తోంది.రాజధాని మీదుగా విజయవాడ బైపాస్ రహదారి నిర్మించగా, అది అందుబాటులోకి కూడా వచ్చింది. అమరావతి ఓఆర్ఆర్ ప్రాజెక్టును 189.4 కి.మీ. పొడవునా 6 లైన్ల యాక్సెస్ కంట్రోల్డ్ రహదారిగా చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది.దీనికి డీపీఆర్ సిద్ధమవుతోంది. భూసేకరణ మొదలైంది. తెలంగాణలోని ఎర్రుపాలెం నుంచి రాజధాని అమరావతి మీదుగా నంబూరు వరకు 57 కి.మీ. మేర రైల్వే లైన్ నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలవనున్నారు. ఇటీవలే అమరావతిలో పొట్టి శ్రీరాములు భారీ కాంస్య విగ్రహం ఆవిష్కరించారు. ఇలాంటివి మరికొన్ని త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో దెబ్బతిన్న అమరావతి ప్రతిష్టను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించగలిగిందని రైతులు అంటున్నారు.సుర్బానా-జురాంగ్ సంస్థకు బాధ్యతలు: బిట్స్ అమరావతి క్యాంపస్‌ని వెయ్యి కోట్లతో నిర్మిస్తోంది. ఎక్స్ఎల్ఆర్ఐ, నేషనల్ లా యూనివర్సిటీ వంటి ప్రముఖ విద్యా సంస్థలు త్వరలోనే నిర్మాణాలు ప్రారంభించనున్నాయి. రూ.600 కోట్లతో ఏపీ ఎన్ఆర్‌టీ భవనం నిర్మిస్తున్నారు. ఐటీ టవర్ల నిర్మాణానికి ఎల్ అండ్ టీ సంస్థకు 10 ఎకరాలు కూడా కేటాయించింది. పలు హోటళ్లు, ఆస్పత్రులు, స్కూళ్లకు ప్రభుత్వం స్థలాలిచ్చింది. త్వరలోనే నిర్మాణాలు ప్రారంభించనున్నాయి.రాజధాని 2వ దశలో భాగంగా ఇంటర్నేషనల్ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ ప్రాజెక్టుల కోసం 2వ విడత భూ సమీకరణ కూడా మొదలైంది. 7 గ్రామాల్లోని రైతుల నుంచి 16,562 వేల ఎకరాలను సీఆర్డీఏ సమీకరిస్తోంది. మొత్తం 709 చదరపు కి.మీ. ప్రాంతానికి మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేసింది. అదే విధంగా వాటి బాధ్యతను సింగపూర్‌కి చెందిన సుర్బానా-జురాంగ్ సంస్థకు అప్పగించింది. అమరావతికి అన్నీ మంచి శకునములే అన్నట్లుగా పరిస్థితి ఉంది.

# శ్రీశైలం ఘాట్ రోడ్డులో ఎలివేటెడ్ కారిడార్

**మొదటిపేజీ తరువాయి** - ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం అటవీ ప్రాంతం మీదుగా వెళ్లేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయంపై దృష్టి సారించింది. ముఖ్యంగా వన్యప్రాణులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఘాట్‌లో ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు రంగం సిద్ధం చేసింది. అదే విధంగా కీలకమైన అటవీ ప్రాంతంలో 86.74 కిలోమీటర్ల మేర వంతెనపై వెళ్లే హైవే నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్‌కు గాను రూ. 18,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. దీంతో వాహన రాకపోకలు వేగంగా సాగుతాయని భావిస్తున్నారు.

**ప్రత్యామ్నాయంపై దృష్టి:**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి భక్తులు రావాలంటే ఏపీ మొత్తానికీ దోర్నాల మార్గం ఒక్కటే ఉంది.అంతేకాకుండా ఏపీవ్యాప్తంగా ఎటువైపు నుంచి అయినా వాహనాలు దోర్నాలకు వచ్చి తీరాల్సిందే. అంతేకాకుండా తెలంగాణ నుంచి వచ్చేవారు కల్వకుర్తి, మన్ననూరు మీదుగా అటవీ ప్రాంతంలో ప్రయాణించాలి. దాంతోపాటు జాతీయ రహదారి-765 మీదుగానే ఈ రాకపోకలను సాగిస్తుండటం గమనార్హం. శ్రీశైలానికి వచ్చే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతూ వస్తుండటంతో వాహన రద్దీ సైతం ఎక్కువైంది. దీనికి అనుగుణంగా హైవేను 4 వరుసలుగా విస్తరించేందుకు భారీ ఎత్తున అటవీ భూములు అవసరం. కానీ అది సాధ్యం కావడం లేదు. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టి మరల్చింది. కీలకమైనటువంటి అటవీ ప్రాంతంలో 86.74 కిలోమీటర్ల మేర వంతెనపై వెళ్లే హైవే-ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని అధికారులంతా నిర్ణయించారు. దీని ద్వారా వన్యప్రాణులకు ఇబ్బంది ఉండదని, వాహన రాకపోకలు సైతం వేగంగా సాగుతాయని వారంతా భావిస్తున్నారు.ప్రాజెక్ట్‌కు రూ. 18,500 కోట్ల ఖర్చు! శ్రీశైలం వైపు పయనమయ్యే ఘాట్‌లో నల్లమల అటవీ ప్రాంతం, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, నాగార్జునసాగర్- శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతాలు వరసగా ఉన్నాయి. దాంతో ఆయా ప్రాంతాల్లో తెలంగాణ పరిధిలో 45.35 కిలోమీటర్లు, ఏపీలోని 41.39 కిలోమీటర్లతో కలిపి మొత్తంగా 86.74 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించనున్నారు. ఇది నాలుగు వరుసలతో ఉండనుండటం గమనార్హం. అదే రీతిలో కృష్ణా నదిపై ప్రస్తుతం ఉన్న వంతెనకు, డ్యామ్‌కు మధ్యలో 450 మీటర్ల పొడవునా కొత్తగా ఐకానిక్ వంతెన నిర్మించనున్నారు. శ్రీశైలం క్రాస్ రోడ్ వద్ద నుంచి సరాసరి ఆలయం వరకు 4.33 కిలోమీటర్ల అనుసంధాన రోడ్డును నిర్మించనున్నారు. మొత్తంగా ఈ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్‌కు రూ. 18,500 కోట్ల ఖర్చవుతుందని అధికారుల ప్రాథమిక అంచనా. ఇందులో ఏపీ పరిధిలో రూ. 10,500 కోట్లు, తెలంగాణలో భాగానికి రూ 8,000 కోట్లుగా అంచనాలున్నాయి.తెలంగాణ రాష్ట్రం వైపు ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించిన ప్రతిపాదనను మోర్త్‌కు చెందిన అలైన్‌మెంట్ అప్రూవల్ కమిటీ వద్ద చూపించారు. ఈ కారిడార్‌తో సహా ఏపీ పరిధిలోని కారిడార్‌ను కూడా కలిపి నిర్మించాల్సి ఉంమడటంతో ఏపీ నుంచి సైతం ప్రతిపాదనలు ఏసీసీ కి అందజేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధమవుతున్నారు. ఏపీ పరిధిలోని ఈ కారిడార్ అలైన్‌మెంట్‌పై పలు అభిప్రాయాలు, సూచనలు తెలపాలని అటవీశాఖను ఇటీవల జాతీయ రహదారుల అధికారులు ఇప్పటికే కోరారు. అయితే దీనిపై అటవీశాఖ ఏం చెబుతుందో చూసిన తర్వాత అలైన్‌మెంట్‌ను మోర్త్‌కు పంపనున్నారు.

**కారిడార్‌తో నిరంతరాయ ప్రయాణాలు:** ఏపీలో దోర్నాల నుంచి, తెలంగాణలో బ్రాహ్మణపల్లి వరకు కారిడార్ అందుబాటులోకి వచ్చినట్లయితే వాహనాలు నిరంతరాయంగా, వేగంగా వెళ్లేందుకు వీలుంటుందని స్థానికులు భావిస్తున్నారు. భక్తులు ఏ విధమైన ఇబ్బందులకు గురికాకుండా వారి గమ్యస్థానాలకు చేరుకుంటారని అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు ఘాట్‌లో వాహనాలను అనుమతించడం లేదు, కానీ కారిడార్ వస్తే మాత్రం ప్రయాణం నిరంతరాయంగా ఉంటుందని వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# 2029లోపే మహిళా రిజర్వేషన్లు

**మొదటిపేజీ తరువాయి** – మన ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఒక గొప్ప అవకాశం. అందరినీ కలుపుకొని ముందుకు సాగాలన్న మన సమష్టి నిబద్ధతను చాటుకోవాల్సిన సమయం ఇది" అని మోదీ పేర్కొన్నారు. జాతి నిర్మాణంలో మహిళల పాత్రను ప్రశంసిస్తూ, వారు నిర్ణయాధికారంలో చురుకైన పాత్ర పోషించినప్పుడే దేశం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు.2023లో పార్టీలకు అతీతంగా ఎంపీలందరూ ఈ బిల్లుకు మద్దతు పలికిన క్షణాలను ప్రధాని గుర్తుచేశారు. దేశ మహిళలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి అందరూ ఏకతాటిపై నిలిచిన ఆ సందర్భం చిరస్మరణీయమని అన్నారు. అయితే, రిజర్వేషన్ల అమలు సమయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైన నేపథ్యంలో, నిపుణులు, రాజకీయ పార్టీలతో విస్తృత చర్చల అనంతరం ప్రభుత్వం ఒక



నిర్ణయానికి వచ్చిందని తెలిపారు.ప్రస్తుత ప్రతిపాదన ప్రకారం మహిళా రిజర్వేషన్ల అమలును 2027 జనాభా లెక్కలతో ముడిపెట్టకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగానే చేపట్టాలని కేంద్రం భావిస్తోంది. దీనివల్ల 2029 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నాటికి మహిళా కోటాను అమలు చేయడం సాధ్యమవుతుంది. "దేశవ్యాప్తంగా నారీశక్తి వందన్ అధినియం స్ఫూర్తిని అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఇది మన ప్రజాస్వామ్య వ్యవస్థలకు కొత్త శక్తినిస్తుంది" అని మోదీ తన లేఖలో వివరించారు.ఇది ఏ ఒక్క పార్టీకో, వ్యక్తికో సంబంధించిన అంశం కాదని, మహిళలు, భావి తరాల పట్ల మనందరి బాధ్యత అని ప్రధాని అన్నారు. ఈ చారిత్రక ఘట్టంలో పాలుపంచుకునే అవకాశం వదులుకోవద్దని, ఈ సవరణకు మద్దతు ఇవ్వడం ద్వారా మన ప్రజాస్వామ్య సంప్రదాయాలను మరింత బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం కాబట్టి, ప్రతిపక్షాల మద్దతు ఈ బిల్లు ఆమోదానికి అత్యంత కీలకం కానుంది.

# రాష్ట్రంలో కాంగ్రెస్ 'దోచుకో-దాచుకో' పథకం నడిపిస్తోంది

**మొదటిపేజీ తరువాయి** – "సింగరేణిలో వేల కోట్ల రూపాయల దోపిడీ జరుగుతున్నా, 49 శాతం వాటా ఉన్న కేంద్ర ప్రభుత్వం ఉలుకూపలుకూ లేకుండా మౌనంగా ఉంది. దీనిపై సీబీఐ విచారణ జరపాలని కోరినా పట్టించుకోవడం లేదు. ప్రధాని మోదీ తెలంగాణకు వచ్చి 'ఆర్ఆర్ ట్యాక్స్' వసూలు చేస్తున్నారని విమర్శించారు. హోంమంత్రి అమిత్ షా తెలంగాణ కాంగ్రెస్ ఏటీఎంగా మారిందని ఆరోపించారు. కానీ, ఇప్పటివరకు ఆ ఆరోపణలపై ఎందుకు విచారణకు ఆదేశించలేదు? దీన్నిబట్టి కాంగ్రెస్, బీజేపీలు చీకటి దోస్తులని, ఒకరి అవినీతిని మరొకరు కాపాడుకుంటున్నారని స్పష్టమవుతోంది," అని కేటీఆర్ విమర్శించారు.సింగరేణిలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి అరాచకాలకు పాల్పడుతున్నారని, 'సైట్ విజిటేషన్ సర్టిఫికేట్' అనే కొత్త విధానంతో కాంట్రాక్టర్లను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. వేల కోట్ల కుంభకోణంపై ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, స్థానిక మంత్రి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన వారసత్వ ఉద్యోగాలపై విచారణ జరిపిస్తామని బెదిరించడం కాదని, సృజన్ రెడ్డి అవినీతిపై విచారణ జరిపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, అవినీతిని ఆపకపోతే ప్రతి బొగ్గు గనిపైనా అగ్గిపుట్టిస్తామని హెచ్చరించారు.క్యాతనపల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ 14 స్థానాలు గెలిచినా, మంత్రి



వివేక్ ఓటమిని తట్టుకోలేక కౌన్సిలర్లను వేధించారని కేటీఆర్ మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను అక్రమంగా అరెస్ట్ చేసి జైల్లో పెట్టారని, పోలీసులతో భయానక వాతావరణం సృష్టించారని ఆరోపించారు. ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగని తమ పార్టీ కౌన్సిలర్లను అభినందించారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, కేసీఆర్ చెప్పినట్లుగానే కాంగ్రెస్ పార్టీ అభయహస్తం పేరుతో తెలంగాణపై భస్మాసుర హస్తం పెట్టిందని కేటీఆర్ అన్నారు. సింగరేణి కార్మికుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని, రానున్న యూనియన్ ఎన్నికల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.

## తెలంగాణ ఇంటర్ ఫలితాలు విడుదల... అమ్మాయిలదే హవా!

**మొదటిపేజీ తరువాయి** – విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఈ ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. ఈ ఫలితాల్లో ఇంటర్ ఫస్టియర్‌లో 66.20 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, సెకండియర్‌లో 70.58 శాతం మంది పాసయ్యారు. ఎప్పటిలాగే ఈసారి కూడా ఫలితాల్లో అమ్మాయిలే పైచేయి సాధించి తమ సత్తా చాటారు.ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 1,495 పరీక్షా కేంద్రాల్లో సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. అనంతరం మార్చి 15 నుంచి ఏప్రిల్ 1వ తేదీ మధ్య 20 కేంద్రాల్లో సమాధాన పత్రాల మూల్యాంకన ప్రక్రియను రికార్డు సమయంలో పూర్తి చేసి, వేగంగా ఫలితాలను సిద్ధం చేశారు.

**వెబ్‌సైట్లు, వాట్సాప్‌లోనూ ఫలితాలు :** విద్యార్థులు తమ ఫలితాలను సులభంగా తెలుసుకునేందుకు ఇంటర్ బోర్డు పలు మార్గాలను అందుబాటులోకి తెచ్చింది. అధికారిక వెబ్‌సైట్లయిన `tgbie.cgg.gov.in`, `results.cgg.gov.in`లను సందర్శించి, తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేయడం ద్వారా మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ఏడాది ప్రత్యేకంగా వాట్సాప్ ద్వారా కూడా ఫలితాలు తెలుసుకునే సౌకర్యాన్ని కల్పించారు. -8096958096- నంబర్‌కు వాట్సాప్‌లో 'ఎఱ' అని మెసేజ్ పంపి, సూచనలను అనుసరించి హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేస్తే వెంటనే ఫలితాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి. అక్కడే మార్కుల షీట్‌ను డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది.

**మే నెలలో సప్లిమెంటరీ పరీక్షలు :** వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థుల కోసం మే నెలలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటించనున్నారు. వీటి ఫలితాలను కూడా అదే నెల చివరికల్లా ప్రకటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు స్పష్టం చేశారు.

## బటన్ నొక్కితే కారు నంబర్ ప్లేట్ చేంజ్

**మొదటిపేజీ తరువాయి** – ట్రాఫిక్ చలాన్ల నుంచి తప్పించుకునేందుకు ఓ కారు యజమాని వేసిన హైటెక్ ప్లాన్ బెడిసికొట్టింది. బటన్ నొక్కితే చాలు, క్షణాల్లో నంబర్ ప్లేట్ మారిపోయేలా ఏర్పాటు చేసుకున్న అతడి ప్లాన్‌ను జూబ్లీహిల్స్‌లో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు బట్టబయలు చేశాయి. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన పోలీసులనే ఆశ్చర్యానికి




గురిచేసింది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 1 వద్ద పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు.ఈ క్రమంలో అటుగా వచ్చిన ఓ బీఎండబ్ల్యూ కారును పోలీసులు ఆపారు. ఆ కారును నడుపుతున్న వ్యక్తి మద్యం సేవించినట్లు బ్రీత్ అనలైజర్ పరీక్షలో నిర్ధారణ అయ్యింది. అయితే, వాహనదారుడు వివరాలు చెప్పడానికి నిరాకరించడంతో ఓ కానిస్టేబుల్ కారును పక్కకు తీసేందుకు లోపలికి వెళ్లారు. ఆ సమయంలో స్టీరింగ్ పక్కన ఉన్న ఓ బటన్‌ను పొరపాటున నొక్కడంతో అసలు గుట్టు రట్టయింది.కారు ముందు భాగంలో ఉన్న నంబర్ ప్లేట్ ఒక్కసారిగా తిరగడంతో పోలీసులు అవాక్కయ్యారు. తనిఖీ చేయగా, కారు ముందు వైపు ఢిల్లీ రిజిస్ట్రేషన్‌తో 'ఱూ 6 జవీ 7079' అని, వెనుక వైపు తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో 'ుూ 9 ఖీు 9999' నంబర్ ఉన్నట్లు గుర్తించారు. ఓవర్ స్పీడ్, సిగ్నల్ జంపింగ్ వంటి సమయాల్లో సీసీటీవీ కెమెరాల నుంచి, చలాన్ల నుంచి తప్పించుకోవడానికే ఈ టెక్నాలజీని వాడినట్లు గౌతమ్ విచారణలో అంగీకరించాడు. దీంతో పోలీసులు వెంటనే కారును సీజ్ చేశారు. వాహనదారుడిపై డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు ఫోర్జరీ, మోసం కింద క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ ఫ్లిప్పింగ్ నంబర్ ప్లేట్ టెక్నాలజీని అతనికి ఎవరు అమర్చారనే కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్నారు.

# లక్ష్మీ నగర్ కాలనీకి కొత్త నాయకత్వం అభివృద్ధి దిశగా అడుగులు



**కీసర,ఏప్రిల్12.అక్షర టైమ్స్:-** లక్ష్మీ నగర్ కాలనీ వాసులు ఏకగ్రీవంగా తక్కల్ల అభిలాష్‌ను కాలనీ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కాలనీ ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాలనీ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కాలనీ సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల మెరుగుదల, పరిశుభ్రత, భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. కమిటీ సభ్యులతో కలిసి సమిష్టిగా పనిచేసి కాలనీని అభివృద్ధి మార్గంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.ఈ కమిటీలో కుంచపు నాగరాజు జనరల్ కార్యదర్శిగా, ఆడపల్లి శివ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. గండి యాదగిరి మాజీ సర్పంచ్‌గా మద్దతు అందిస్తుండగా, దిలీప్ కుమార్ కౌన్సిలర్ అభ్యర్థిగా పాల్గొన్నారు.కాలనీ అభివృద్ధికి ప్రజల సహకారం కీలకమని నాయకులు ఈ సందర్భంగా కోరారు.

www.akshratimes.com
తెలుగు దినపత్రిక అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
గ్రేటర్ హైదరాబాద్, ఈస్ట్ గోదావరి, కాకినాడ జిల్లా, వెస్ట్ గోదావరి, ఏలూరు జిల్లా

# దళితునిపై చేయి చేసుకున్న స్పీకర్ అయ్యన్న పాత్రుడు పై చర్యలేవి.?

## వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర దళిత నాయకుడు కండెల్ల పెద్దిరాజు



**గోకవరం,ఏప్రిల్12.అక్షర టైమ్స్:-** స్థానిక గుమ్మల్లదొడ్డి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మాదిగ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మరియు పెన్షనర్స్ & రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర కార్యదర్శి కండెల్ల పెద్దిరాజు ఒక పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలు , ప్రజల సంక్షేమాన్ని అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యిందని ఆయన అన్నారు. అయ్యన్న పాత్రుడు బాధ్యతగల ప్రజాప్రతినిధిగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ సభాపతి గా పదవిలో ఉంటూ ఒక దళిత డప్పు కళాకారున్ని గ్రామ దేవత ఉత్సవంలో ప్రజలమధ్య చెంపమీద కొట్టడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, ఒక బాధ్యగల సభా పతిగా సమాజానికి మీరిచ్చే సందేశం ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. డప్పు కళాకారుడు తన వృత్తికి న్యాయం చేయాలన్న తపనతో తోటి కళాకారుల విన్యాశాలకు సరిపోల్చుతూ, తాను ఒకచేత్తో డప్పు కొడుతూ శబ్దానికి తగ్గట్టుగా తన అడుగులు కదులుస్తూ ఆడుతున్న సమయంలో ప్రక్కనే వీక్షించడానికి వచ్చిన “స్పీకర్ అయ్యన్న పాత్రునికి“ డప్పు కళాకారుని యొక్క కాలు తగలగా, ఏదో జరగరానిది జరిగినట్లు తన అగ్రకుల మరియు పదవీ అహంకారంతో, కల్లెర్రజేస్తూ ప్రజల మధ్య డప్పు కళాకారున్ని చెయ్యి చేసుకోవడం అతని దవడపై చెల్లు మనిపించడం చాలా దారుణమైన చర్యని యావత్ దళిత సంఘాలు దీన్ని జీర్ణించుకోలేని అతి జుగుత్సాకరమైన సంఘటన, ఇది అయ్యన్న పాత్రునియొక్క అహంకారానికి నిదర్శనమని, ప్రజలు చూస్తూ ఊరుకోరని, యావత్తు దళిత జాతిని కించపరిచే రీతిగా ఆయన చర్యలు ఉన్నాయని ఆయన అగ్రహించారు. ఒక ప్రజాప్రతినిధిగా అయ్యన్న పాత్రునికి ఇది తగదని, దళితులంటే అంత నీచంగా అలుసైపోయారా..?,మీరు గద్దెనెక్కటానికి మా దళిత ఓట్లు కావాలి, గద్దెనెక్కిన తరువాత పనికిమాలిన, తాకితే మైల అన్నట్టుగా అతని ధోరణి ఉందని, చట్టం ఎవరి చుట్టం కాదు, శభాపతిగా సభలో మీకు చట్టం వర్తించదేమో గాని, బయట జరిగిన అసాంఘికమైన చర్యలకు ఖచ్చితంగా శిక్షకు పాత్రులే స్పీకరుపై వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి, తన కుల అహంకారానికి ప్రతీకగా “యస్. సి, యస్ టి“ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలి, అదేవిధంగా గాయపడిన, భంగ పడిన దళిత డప్పు కళాకారునికి వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని, బాధితుడు సమాజంలో మానసికంగా, బౌతికంగా గాయపడ్డాడు కనుక ప్రభుత్వం బాధితుని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి, సమాజంలో తలెత్తుకుని గౌరవంగా బ్రతికేలా చెయ్యాలని, లేనిపక్షంలో దీనిని ప్రజల్లోకి తీసుకువెళ్లి మరింత ఉదృతం చేసి దళితుల ఐక్యత సాటి మీకు సరైన బుద్ది బహిరంగంగా చెప్పవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

# గిరిజనలు నష్టపోతుంటే అధికారులు పట్టించుకోరా...

**- రెవిన్యూ శాఖ అధికారులు నోటీసులు పట్టించుకోని ఎమ్మెల్యే మేనల్లుడు వేణుగోపాల్**

**- యధా విధిగా కొనసాగుతున్న చుప్పరిపాలెం గ్రానైట్ క్వారీ తవ్వకాలు**

**- పట్టించుకోని మైనింగ్ రెవెన్యూ శాఖ అధికారులు**

**- గ్రానైట్ రాయిని బయటకు తరలించేందుకు ఎమ్మెల్యే మేనల్లుడు సన్నాహాలు**





**పోలవరం,ఏప్రిల్12.అక్షర టైమ్స్:-సురేష్ :** చుప్పరిపాలెం క్వారీ ఒప్పందాల్లో రోజుకోక వివాదం తెరమీదకి వస్తుంది. భారీ స్థాయిలో పెట్టుబడి పెట్టిన సురేంద్ర ని ఎమ్మెల్యే మేనల్లుడు వేణుగోపాల్ పక్కన పెట్టీ తన పైన తప్పుడు కేసులు నమోదు చేసి ప్రయత్నం చేస్తున్నారని పార్టనర్ సురేంద్ర తెలియజేశారు. అతను మాట్లాడుతూ సంబంధించిన మైనింగ్ రెవిన్యూ శాఖ అధికారులకు పిర్యాదు చేయడం జరిగిందిని సురేంద్ర తెలియజేశారు. సానుకూలంగా స్పందించిన అధికారులు చుప్పరిపాలెం గ్రానైట్ క్వారీ వద్దకు వచ్చి సొసైటీ వరకు ఎమ్మెల్యే మేనల్లుడు వేణుగోపాలకు క్వారీ పనులు నిలిపివేయాలని రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు.అయినప్పటికీ అధికారులు నోటీసులు పక్కన పెట్టి ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంట నుండి వృధావిధిగా క్వారీ పనులు ఎమ్మెల్యే నాగేశ్వరరావు మేనల్లుడు దగ్గరుండి కొనసాగించాడు.ఎమ్మెల్యే మేనల్లుడు దగ్గరుండి కొనసాగించాడు.రెవిన్యూ అధికారులు నోటీసులు వేణుగోపాల్ పట్టించుకోలేదని చుప్పరి పాలెం గ్రానైట్ క్వారీ పనులు పార్ట్ నర్ ఇద్దరు మధ్య వివాదాలు రావడం వల్ల గిరిజనులు నష్టపోతున్నారని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ ఎమ్మెల్యే మేనల్లుడు వేణుగోపాల్ పెట్టి వృధావిధిగా క్వారీ పనులు కొనసాగించారు.గిరిజనలు నష్టపోతుంటే అధికారులు పట్టించుకోరా పార్ట్ నర్ లు విభేదాలు కారణంగా చుప్పరిపాలెం గ్రానైట్ క్వారీ కి సంభంచిన గిరిజనులు కు తీవ్రంగా నష్టపోతున్నారని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించి గిరిజనలు కు నాయ్యాం చెయ్యాలని గిరిజనులు కోరుతున్నారు.

## చీరాల గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం 96 మందికి సేవలు





**కీసర,ఏప్రిల్12.అక్షర టైమ్స్:-** కీసర సర్కిల్, డివిజన్-1, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధిలోని చీరాల గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. పీపుల్స్ వెల్ఫేర్ ట్రస్ట్, నవోదయ సంక్షేమ వేదిక, సిఐటియు కీసర మండల కమిటీ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో అంబేద్కర్ భవనం వద్ద ఈ శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరాన్ని జిల్లా డీసీసీ కార్యదర్శి బక్కని నర్సింగ్ రావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీతో పాటు అవసరమైన వారికి ఉచిత శస్త్రచికిత్సలు అందించడం అభినందనీయం అని తెలిపారు. శిబిరంలో కంటి, దంత, రక్తపోటు, చక్కెర మరియు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 96 మంది గ్రామస్తులకు వైద్య సేవలు అందించగా, 17 మందికి శస్త్రచికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

## ఉప్పల్ డివిజన్ న్యూ శాంతినగర్ లో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరిక





**ఉప్పల్,ఏప్రిల్12.అక్షర టైమ్స్:-** మేడ్చల్ మల్కాజ్గిరి,ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో భారీ సంఖ్యలో చేరారు.పార్టీలో చేరిన వారికి పరమేశ్వర్ రెడ్డి, పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలతో అన్ని పార్టీల దృష్టి కాంగ్రెస్ వైపు మళ్లిందన్నారు.కాంగ్రెస్ పార్టీ లో న్యూ శాంతినగర్ అధ్యక్షులు లక్ష్మయ్య ,జనరల్ సెక్రటరీ సైదులు , ఉపాధ్యక్షులు పరశురామ్ , జాయింట్ సెక్రటరీ ప్రభాకర్ , జాయింట్ సెక్రటరీ శ్రీకాంత్ ,మాజీ అధ్యక్షులు లకన్ ,మాజీ అధ్యక్షులు గంట చంద్రశేఖర్ రెడ్డి,మెంబెర్స్ మత్స్యగిరి, యాదగిరి,ఉదయ్ , నర్సింహా, మల్లయ్య, కృష్ణ, దర్శన్, ఉప్పలయ్య, మారయ్, రాజు, సోమయ్య, సాయికుమార్, సత్తయ్య,శివ, జనార్ధన్,కిష్టయ్య,సుదర్శన్,పూరషోత్తం ఉప్పల్ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ,తుమ్మల దేవిరెడ్డి,వెంకటేష్ గుప్తా,అలుగుల అనీల్ కుమార్,జనగాం రామకృష్ణ ,అల్వాల భాస్కర్ ,నోముల సురేష్ ,మోహన్ నాయక్,రంగుల శేఖర్, శివ,ధనలక్ష్మి, భవాని ,మమత, రాణి ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ కి మల్లవరం టీమ్



**గోకవరం,ఏప్రియల్12.అక్షర టైమ్స్:-** భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించుకుని మల్లవరం జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ లో పలు గ్రామాల నుండి పాల్గొన్న టీముల మధ్య గోదావరి పోరు జరుగుతుంది గత వారం రోజులుగా మల్లవరం గ్రామ అంబేద్కర్ యూత్ సభ్యుల నిర్వహిస్తున్న ఈ పోటీలు ఆసక్తికరంగా మారాయి. గోకవరం మండలం మల్లవరం గ్రామంలో జరుగుతున్నటువంటి క్రికెట్ టోర్నమెంట్ లో మొదటి సెమి ఫైనల్ లో జగ్గంపేట వర్సెస్ మల్లవరం సీనియర్ టీం రెండు జట్ల మధ్య హోరా హోరీగా జరిగిన మ్యాచ్ లో మల్లవరం సీనియర్ టీం విజయం సాధించి ఫైనల్ చేరింది. మల్లవరం క్రికెట్ టీం చూపించిన ఆట తీరును పలు గ్రామాల క్రీడా అభిమానులు ప్రత్యేకించి అభినందించారు. నేడు సోమవారం చెన్నూరు కామరాజుపేట సెమీఫైనన్లో తలపడనున్నాయి వీటిలో విజేతలు ఫైనల్ చేరి మల్లవరం టీం తో ఫైనల్ ఆడనున్నాయి ఈ టీంలో విజేతలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా మంగళవారం యూత్ సభ్యులు గ్రామ పెద్దలు అందరి సమక్షంలో ట్రోఫీని అందజేయనున్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు గ్లోబల్ అలుమ్ని వెల్ఫేర్ ట్రస్టు (స్కూల్ మెట్ ట్రస్ట్ ) స్టాండ్ ఫ్యాన్ అందచేత



**గోకవరం,ఏప్రిల్12.అక్షర టైమ్స్:-** గోకవరం మండలం రంప ఎర్రంపాలెం ఆగ్ని ప్రమాద బాధితులకు స్టాండ్ ఫ్యాన్ కొని ఇవ్వడం జరిగినది. గతంలో రెండు కుటుంబాలకు 19500/ రూపాయలు విలువ చేసే,వంట సామాన్లు బట్టలు అమౌంట్ ట్రస్ట్ ఇవ్వడం జరిగినది. ట్రస్ట్ నుంచి మెసేజ్ పెట్టిన వెంటనే రెస్పాన్స్ అయిన యువత గ్రామంలో ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే ఎక్కడ ఉన్నా వెంటనే స్పందిస్తారు వారు ఆర్థిక సహాయం చేస్తారు ఈ కార్యక్రమంలో , ట్రస్టు ప్రెసిడెంట్ కాకర విష్ణు,ట్రస్టు గౌరవ సభ్యులు పాటి రాజా ,పాటి బులిబ్బాయి, లావేటి సత్తిబాబు,చెక్క గణేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మిట్ట మధ్యాహ్నం అగ్ని ప్రమాదం

**- తప్పిన ప్రాణ నష్టం**



**బోనకల్,ఏప్రిల్12.అక్షర టైమ్స్:-**బోనకల్ గ్రామపంచాయతీలో నంద్రు కృష్ణ, నాగమణి దంపతుల ఇంట్లో ఆదివారం (ఏప్రిల్ 12, 2026) మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదం విషయం తెలుసుకొని, రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకులు బీపీ నాయక్ ఘటన స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తోటపల్లి స్వామి మరియు ఇతర నాయకులతో కలిసి బాధిత కుటుంబం గోడు విన్నారు. విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, అగ్ని ప్రమాద కారణాలు త్వరగా పరిశీలించి నివేదిక ఇవ్వాలని, బాధితులను తక్షణం ఆదుకోవాలని కోరారు.అనంతరం బీపీ నాయక్ తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ వంశీ కృష్ణ, జ్వాల నాయక్, అంతోటి వెంకటేశ్వర్లు, మల్లెల ఉపేందర్, యార్లగడ్డ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. బాధిత కుటుంబం (నంద్రు కృష్ణ, నాగమణి దంపతులు)కు త్వరిత సహాయం అందాలని, అధికారులు బాధ్యత తీసుకోవాలని కోరారు.

## లక్ష్మీపురం విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో మార్క్ ఫేడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు

**- ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి కోటేశ్వరరావు**

**- సర్పంచ్ మంద కరుణ**







**బోనకల్,ఏప్రిల్12.అక్షర టైమ్స్:-** బోనకల్ మండలం లక్ష్మీపురం గోవిందపురం గ్రామాలలో అనంతరం మొక్క జొన్నలు మార్కెట్ ద్వారా ప్రతి గింజలు కొనుగోలు చేయాలని ఎలాంటి షరతులు లేకుండా రైతులు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాన్ని సజావుగా నడిపించాలని మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ కు బండారు నరసింహారావు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో,ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య, మాజీ సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు సిపిఎం సీనియర్ నాయకులు మాజీ సర్పంచి మాదినేని నారాయణ తమ్మరపు లక్ష్మణ్ నల్లమోతు వాణి ముత్తారపు వెంకటి, కళ్యాణపు శ్రీనివాసరావు, తూటికుంట్ల సర్పంచ్ తుళ్లూరి లక్ష్మీనరసయ్య లక్ష్మీపురం సర్పంచ్ మద్రి సిలువ పోలూరు గాంధీ మామిళ్ళ కోటేశ్వరరావు,నల్లమోతు నాగేశ్వరరావు సొసైటీ సిబ్బంది తదితర రైతులు పాల్గొన్నారు.

## వేంపాడు గ్రామంలో వివాహ వేడుకలో పాల్గొన్న డాక్టర్ కడియాల లలిత్ సాగర్



**దర్శి,ఏప్రిల్12.అక్షర టైమ్స్:–** ముండ్లమూరు మండలం, వేంపాడు గ్రామంలో కరి లక్ష్మీనారాయణ (లేట్) – పార్వతి ల కుమార్తె కళ్యాణ మహోత్సవానికి టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ ఆదివారం హాజరై నూతన వధువు షణ్ముఖ ప్రియా ను ఆశీర్వాదించి... వివాహా శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమం లో ముండ్లమూరు మండల టిడిపి అధ్యక్షులు కూరపాటి శ్రీను, శంకరాపురం సర్పంచ్ నారాయణ స్వామి, మేదరమెట్ల వెంకట్రావు, రామారావు, వేంపాడు గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.



www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లా


## శ్రీ లక్ష్మీ సమేత వెంకటేశ్వర స్వామి వారి తిరునాళ్ళ మహోత్సవం లో పాల్గొన్న డాక్టర్ కడియాల లలిత్ సాగర్







**దర్శి,ఏప్రిల్12.అక్షర టైమ్స్:–** దర్శి మండలం, తూర్పు వెంకటాపురం గ్రామం లో ఆదివారం జరిగిన శ్రీ లక్ష్మీ సమేత వెంకటేశ్వర స్వామి వారి 44వ వార్షికోత్సవ తిరునాళ్ళ మహోత్సవ కార్యక్రమం లో టిడిపి యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ పాల్గొని స్వామి వారికీ ప్రత్యేక పూజలు చేసి వెంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమం లో దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, తూర్పు వెంకటాపురం గ్రామ పార్టీ అధ్యక్షులు కర్నాటి వెంకట నారాయణ, హైస్కూల్ విద్యాకమిటి చైర్మన్ పిన్నిక సత్యనారాయణ, దర్శి టౌన్ టిడిపి అధ్యక్షులు చిన్నా, అంజి, స్థానిక నాయకులు ఉన్నారు.



## మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

### జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు



**ఒంగోలు,ఏప్రిల్12.అక్షర టైమ్స్:–** మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 13 న సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రాహుల్ కు అభినందనలు తెలిపిన పల్లెప్రపంచం ఫౌండేషన్



**బోనకల్,ఏప్రిల్12.అక్షర టైమ్స్:–** బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో 936 మార్కులతో కాలేజీ టాపర్ గా నిలిచిన బోయినపల్లి రాహుల్ సాయి కి పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు అభినందనలు తెలిపారు. రాహుల్ సాయి పల్లెప్రపంచం ఫౌండేషన్ కార్యదర్శి బోయినపల్లి అంజయ్య కుమారుడు కావడం విశేషం. రాహుల్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. చొప్పకట్ల పాలెం గ్రామంలో పేద కుటుంబంలో జన్మించిన రాహుల్ ప్రభుత్వ విద్యను అభ్యసిస్తూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్ఫూర్తిదాయకంగా నిలిచాడన్నారు. చొప్పకట్లపాలెంలో త్వరలో రాహుల్ సాయి కి పల్లెప్రపంచం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేయనున్నట్లు పల్లా కొండలరావు తెలిపారు. రాహుల్ సాయి కి అభినందనలు తెలిపినవారిలో పల్లెప్రపంచం ఫౌండేషన్ కార్యదర్శి బోయినపల్లి అంజయ్య, కొండేటి అప్పారావు, రచ్చా మధు సూదన్ రావు, బోయినపల్లి సురేష్, కొండేటి ప్రవీణ్, మార్కపుడి బ్రహ్మం, సిపిఎం శాఖా కార్యదర్శులు చలమల అజెయ్ కుమార్, బండి శ్రీనివాసరావు, బోయినపల్లి పున్నయ్య, వార్డు సభ్యులు బోయినపల్లి లక్ష్మి,మార్కపుడి రజిని, మాజీ సర్పంచ్ బూసి వెంకటేశ్వర్లు, సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్ తదితరులు ఉన్నారు.

# వడ్డీకాసుల వాడికి కాసుల వర్షం
# రికార్డు స్థాయిలో శ్రీవారి దర్శనాలు



### 6 నెలల పాటు ప్రతినెలా రూ.120 కోట్లకు పైగా హుండీ ఆదాయం
### – లడ్డూ విక్రయాల్లో 12.68శాతం వృద్ధి
### – సాంకేతికత, పక్కా ప్రణాళికతో పెరిగిన భక్తుల సంఖ్య


**అక్షర టైమ్స్:** : తిరుమల శ్రీవారిని దర్శనానికి విచ్చేసిన భక్తుల సంఖ్య 2025–26లో గణనీయంగా పెరిగింది. టీటీడీ యంత్రాంగం సాంకేతికతను సమర్థవంతంగా అందిపుచ్చుకుంటోంది. దీంతో పాటు టీటీడీ పక్కా ప్రణాళికతో వ్యవహరిస్తోంది. సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తోంది.

దళారీ వ్యవస్థను విజయవంతంగా కట్టడి చేయడంతో శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య, హుండీ ఆదాయం, ప్రసాదాల పంపిణీ వంటి అన్ని కీలక విభాగాల్లోనూ రికార్డు స్థాయిలో వృద్ధి నమోదైంది. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా క్యూలైన్ల నిర్వహణలో డైనమిక్ నిర్ణయాలు, గదుల కేటాయింపులో పారదర్శకత వంటి చర్యలు దీనికి ఎంతగానో దోహదం చేశాయి.

4.57 శాతం వృద్ధి: 2023–24, 2024–25లో సగటున రోజుకు 70,000 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 2025–26లో ఆ సంఖ్య రోజుకు 73 వేల మందికి చేరడం గమనార్హం. తద్వారా దర్శనాల్లో 4.57 శాతం కూడా వృద్ధి నమోదైంది. గత ఏడాది జూన్ నెలలో శనివారాల్లో సగటున 90 నుంచి 95 వేల మందికి పైగా భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అంతేకాకుండా, వైకుంఠ ఏకాదశి సందర్భంగా 10 రోజుల్లో అంతకుముందు ఏడాదితో పోలిస్తే అదనంగా లక్షా 40 వేల మంది వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

"కమాండ్"తో దర్శనాల్లో వేగం: ఏఐ (కృత్రిమ మేధ) ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా కార్యకలాపాలను పర్యవేక్షించడం ద్వారా క్యూలైన్లలో భక్తుల రద్దీ, కంపార్ట్‌మెంట్ల వెయిటింగ్ సమయాన్ని బట్టి ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోగలిగారు. తద్వారా అత్యధిక సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకునేలా చర్యలు చేపట్టారు. స్వామివారి కైంకర్యాలకు, బ్రేక్ దర్శనాలకు ఎటువంటి జాప్యం లేకుండా సమయాన్ని పక్కాగా వినియోగించుకోవడంతో భక్తులకు మెరుగైన, వేగవంతమైన దర్శన భాగ్యం కలుగుతోంది. పెరుగుతున్న భక్తులకు అనుగుణంగా యంత్రాల ద్వారా 2,000 మంది కార్మికులతో పారిశుద్ధ్య నిర్వహణను అధికారులు మెరుగు పరిచారు. 6 నెలలు కాసుల వర్షం: సాధారణంగా తిరుమలలో జులై, ఆగస్టు నెలల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈ నెలల్లో శ్రీవారి హుండీ ఆదాయం రూ.120 కోట్లు దాటుతుంది. అయితే 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 6 నెలల పాటు హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో వచ్చింది. ప్రతినెలా రూ.120 కోట్లకు పైగా హుండీ ఆదాయం నమోదు కావడం విశేషం. మొత్తంగా ఆ ఏడాదిలో హుండీ ఆదాయం రూ.1,420 కోట్లు పైగా నమోదైంది. చరిత్రలో తొలిసారిగా దళారీ వ్యవస్థ కట్టడి: తిరుమల తిరుమతి దేవస్థానం చరిత్రలో మొట్ట మొదటిసారిగా గదుల కేటాయింపులో దళారీ వ్యవస్థను అధికారులు పూర్తిగా నియంత్రించారు. గతంలో దర్శనంతో సంబంధం లేకుండా భక్తులకు గదులు కేటాయించేవారు. దీనివల్ల బ్లాక్ మార్కెట్ దందా విపరీతంగా పెరిగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దర్శనం ఉంటేనే గది కేటాయింపు విధానాన్ని ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కఠినంగా అమలు చేశారు. దీంతో అక్రమాలకు బ్రేక్ పడింది. ఫలితంగా భక్తులకు వేగంగా గదులు అందుబాటులోకి రావడంతో పాటు, వసతి సౌకర్యాలకు సంబంధించి ఆదాయం 2024–25లో రూ.133 కోట్లు ఉంటే, 2025–26లో రూ.141 కోట్లు నమోదైంది. ఏఐ టెక్నాలజీతో మరింత రుచిగా లడ్డూ: శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో టీటీడీ విప్లవాత్మక మార్పులను ప్రవేశపెట్టింది. ముడి సరకు నాణ్యతను తనిఖీ చేసి గ్రేడింగ్ చేసేందుకు ఏఐ టెక్నాలజీని, యంత్రాలను వినియోగిస్తున్నారు. లడ్డూ నాణ్యత, రుచి మరింత పెరిగాయని భక్తులు అభిప్రాయపడుతున్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్లుగా ఉత్పత్తిని కూడా భారీగా పెంచారు. 2024–25లో అది 13.95 కోట్లకు (12.68 శాతం వృద్ధి) చేరింది. లడ్డూల పంపిణీకి పర్యవరణహితమైన జ్యూట్, డిస్పోజబుల్ బ్యాగులను ఫుడ్ కార్పొరేషన్ సహకారంతో అందుబాటులోకి తీసుకువచ్చారు. త్వరలో లడ్డూల కౌంటర్ల వద్ద యూపీఐ చెల్లింపు సదుపాయాలను ప్రవేశపెట్టనున్నారు. అన్నప్రసాద భవనంలో సేవల విస్తరణ: భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని వారికి తగ్గట్లుగానే మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో సేవల విస్తృతి గణనీయంగా విస్తరించారు. దీంతో ట్రస్టుకు విరాళాలు భారీగా వెల్లువెత్తాయి. 2023–24లో రోజుకు సగటున 1.87 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాలు అందించారు. కాగా 2024–25 నాటికి ఈ సంఖ్య 2.21 లక్షలకు పెరిగింది. ఆపై 2025–26లో ఏకంగా 2.85 లక్షలకు చేరింది.

## తారెత్తిస్తున్న ఎండలు, వడగాడ్పులు - కడప జిల్లా అత్యధికంగా 43.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



**అక్షర టైమ్స్:** వేసవి కాలం మొదలు కావడంతో రాష్ట్రంలో రోజురోజుకీ ఎండలు, వడగాడ్పులు తారెత్తిస్తున్నాయి. ఉదయం 10 గంటలు దాటిందంటే ప్రజల ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడతున్నారు. కాగా ఈ రోజు కడప జిల్లాలోని పొట్టిపాడులో అత్యధికంగా 43.8 డిగ్రీలు, తిరుపతి జిల్లా వరదయ్యపాలెంలో 43.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రేపు రాష్ట్ర 51 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు హెచ్చరించారు. మరో 49 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఎండ తీవ్రత, వడగాల్పులు, ఉక్కపోత పట్ల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నగర వాసులు ఉక్కిరిబిక్కిరి: పగటిపూట ప్రయాణించేవారు టోపీలు, మాస్కులు, మహిళలైతే ముఖానికి వస్త్రాలు రక్షణగా ధరిస్తున్నారు. ఇక విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు ఎండలోనే ప్రయాణిస్తున్నారు. కొందరు వేసవి నుంచి ఉపశమనం కోసం చలివేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కొందరు కొబ్బరి బోండాలు, శీతల పానీయాల బళ్ల వద్దకు చేరుతున్నారు. భూతాపంతో ఎండలు ఎక్కువగా ఉండే విజయవాడ వంటి ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు నగర వాసుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

వడదెబ్బ వల్ల నమోదైన కేసులు: ఎండలు, వడగాడ్పుల వల్ల వడదెబ్బలు తగిలే ప్రమాదం లేకపోలేదు. రాష్ట్రంలో 2023లో 833, 2024లో 4,444, 2025లో 5,154 చొప్పున వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. 2025లో అత్యధికంగా ఏలూరు జిల్లాలో 1,284, కృష్ణా జిల్లాలో 1,214, విశాఖలో 1,089, కడపలో 325, పల్నాడు జిల్లాలో 268 చొప్పున వడదెబ్బ కేసుల నమోదయ్యాయి.

# నిబంధన సవరణతో సాదాబైనామా పరిష్కారాలు

**తహసీల్దార్ నుంచి ఆర్డీవోకు అధికారం**

**తిరస్కరించినవీ పరిగణించాలని విజ్ఞప్తులు**

**తమ భూముల క్రమబద్ధీకరణకు ఎదురుచూస్తున్న లక్షల మంది రైతులు**

**ఆర్డీవో విచారణాధికారిగా దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోందని స్పష్టం చేసిన సర్కార్**



తెలంగాణలో భూ క్రయవిక్రయదారులు ఇద్దరూ అఫిడవిట్ సమర్పించాలన్న నిబంధనను సవరించడంతో తిరిగి సాదాబైనామాల పరిష్కారాలు తాజాగా ప్రారంభం అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో రైతులు తమ భూముల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్నారు. రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ విచారణాధికారిగా సాదాబైనామాల దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. 2020 అక్టోబరు-నవంబరులో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 9 లక్షల మంది రైతుల నుంచి సాదాబైనామా సమస్యపై దరఖాస్తులు ప్రభుత్వానికి అందాయి.దరఖాస్తుల తిరస్కరణ : వీటిని హైదరాబాద్‌లోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం ఆన్‌లైన్ ద్వారా ఆయా జిల్లా కలెక్టరేట్లకు బదలాయించింది. అయితే, 2023లో కొన్ని దరఖాస్తులను జిల్లా కలెక్టర్లు తిరస్కరించారు. 2025లో భూ క్రయవిక్రయదారులు ఇద్దరూ అఫిడవిట్ సమర్పించాలన్న నిబంధన తీసుకొచ్చాక కూడా కొన్ని అప్లికేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. కేవలం 7 వేల అప్లికేషన్ల పరిశీలన మాత్రమే పూర్తిచేశారు.నిబంధన సవరించడంతో మార్గం సుగమం : 2014 సంవత్సరానికి ముందు అమ్మిన భూమికి విక్రయదారులు ఇప్పుడు ప్రమాణ పత్రం ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో పలు జిల్లాల్లో అప్లికేషన్లను తిరస్కరించారు. అయితే, గత నెల రెవెన్యూ శాఖ నిబంధనలు సవరించడంతో సాదాబైనామాల భూములను పట్టా చేసుకోవడానికి మార్గం సుగమం చేసింది. ఇప్పుడు గతంలో తిరస్కరించిన దరఖాస్తులను కూడా మళ్లీ పరిగణనలోకి తీసుకోవాలన్న విజ్ఞప్తులు జిల్లాల కలెక్టర్లకు వస్తున్నాయి.కీలకంగా విచారణ..గత ప్రభుత్వంలో జరిగిన సాదాబైనామాల క్రమబద్ధీకరణ సంబంధిత మండలాల తహసీల్దార్లు పూర్తిచేశారు. ప్రస్తుతం భూ భారతి చట్టం ప్రకారం సాదాబైనామాలను క్రమబద్ధీకరించే అధికారాలను ఆర్డీవోలకు కల్పించారు.తహసీల్దారు విచారణ చేసి నివేదిక పంపిస్తే వాటిని పరిశీలించి ఆర్డీవోలు భూ భారతి పోర్టల్లో భూ సమాచారం నమోదు చేసి నిజమైన హక్కుదారులకుల పట్టా చేస్తున్నారు.ప్రస్తుతం క్షేత్రస్థాయి విచారణలో తేలే విషయాలే కీలకంగా మారుతున్నాయి. ఇందుకోసం వాస్తవాలను తెలుసుకునేందుకు క్రమబద్ధీకరించాల్సిన భూముల సరిహద్దు రైతులకు తహసీల్దార్లు నోటీసులు జారీ చేస్తున్నారు.సాదాబైనామా రైతు సమర్పించే అఫిడవిట్ పూర్తి ఆధారాలతో ఉండటంతో పాటు 30 రోజుల పాటు అభ్యంతరాలేవీ రాకుంటే క్రమబద్ధీకరణ పని సులువుగా పూర్తవుతుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న మండలాల్లోని దరఖాస్తులను సైతం పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో తెల్లకాగితంపై రాసుకొని భూములు కొనుగోలు చేసినవారిలో తమ భూములు పట్టా కానున్నాయనే ఆశలు చిగురిస్తున్నాయి.నూతన నిబంధనలు ఇలా : ఉదాహరణకు చూస్తే ఉమ్మడి మెదక్ జిల్లాలో 58,847 దరఖాస్తులను వివిధ కారణాలతో అధికారులు తిరస్కరించారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని మండలాల్లో సాదాబైనామాలకు గతంలో ఎలాంటి అవకాశం కల్పించలేదు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్, పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాల్లోని సాదాబైనామా అప్లికేషన్లను కూడా పరిశీలించనున్నారు.నెల రోజుల్లో అభ్యంతరాలు లేకుండా ఉంటే సరి : అక్టోబరు 2020లో మీ సేవ ద్వారా దరఖాస్తు చేసిన వాటితో పాటు రెవెన్యూ సదస్సుల్లో అందించిన దరఖాస్తులను అధికారులు పరిగణనలోకి తీసుకోనున్నారు. ఈ విషయాల్లో కొనుగోలుదారు తప్పనిసరిగా హాజరు కావాలి. తమ వద్ద ఉన్న సాక్ష్యాలు, డాక్యుమెంట్లతో పాటు హామీ పత్రం ఆర్డీవోకు అందించాలి. వాటిని క్షేత్రస్థాయిలో నిర్ధారించి నెలపాటు అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం ఎలాంటి ఫిర్యాదులు లేకుంటే సమస్య పరిష్కారం అవుతుంది.ఈ సారైనా కొర్రీలు లేకుండా : ఇప్పటికైనా కొత్త నిబంధన మేరకు అర్జీలను అధికారులు త్వరితగతిన పరిశీలించి హక్కులు కల్పిస్తారా కొర్రీలు పెట్టి నాన్చుతారా అనే సందేహాలు మాత్రం బాధితుల నుంచి వ్యక్తమవుతునే ఉన్నాయి.

# మండుటెండలో సన్న బియ్యం తీసుకునేందుకు అష్టకష్టాలు

**సాంకేతిక సమస్యలతో జనం పడిగాపులు**

**చౌక ధరల దుకాణాల వద్ద రద్దీ వల్ల గంటలకొద్దీ నిరీక్షణ**

**జనం తాకిడి తట్టుకోలేక పరిమిత సంఖ్యలో టోకెన్ల జారీ**

**రోజుకి 40 నుంచి 50 మందికే ఇస్తున్న రేషన్ డీలర్లు**

తెలంగాణ రాష్ట్రంలో రేషన్ బియ్యం మూడు నెలల పంపిణీ ప్రక్రియలో పలు సాంకేతిక సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల ఒకటో తేదీ నుంచి కార్డుదారులు చౌక ధరల దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్న ఉదయం నుంచే బియ్యం తీసుకునేందుకు అల్లాడిపోతున్నారు. డీలర్లు జనం తాకిడి తట్టుకోలేక టోకెన్లు జారీ చేసి రోజూ 40 నుంచి 50 మందికి మాత్రమే ఇస్తున్నారు. చాలా మంది రోజుల తరబడి రేషన్ షాపులకు తిరుగుతూ బియ్యం దొరక్క తీవ్ర నిరుత్సాహంతో వెనుదిరిగి ఇళ్లకు వెళ్లిపోతున్నారు.బియ్యం దొరకవనే భయంతో : రాష్ట్రంలో చౌక ధరల దుకాణాల్లో రేషన్ బియ్యం తీసుకోవడం కార్డుదారులకు ప్రహసనంలా మారింది. తరుచూ సర్వర్ మొరాయిస్తుండటం, నెట్‌వర్క్ సమస్యలతో సరఫరా ప్రక్రియ ఆలస్యమవడం ప్రజలకు పరీక్షపెడుతోంది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఏప్రిల్, మే, జూన్ ఈ మూడు నెలలకు కలిపి రేషన్ బియ్యం ఒకేసారి అందజేస్తున్నారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో చౌక ధరల దుకాణాల వద్ద కార్డుదారుల రద్దీ కనిపిస్తోంది. బియ్యం పంపిణీ ఈనెల మొత్తం కొనసాగుతుందని పౌరసరఫరాల శాఖ అధికరులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కార్డుదారులు బియ్యం దొరకవనే భయంతో భారీ స్థాయిలో క్యూ కడుతున్నారు.గంటలకొద్ది నిరీక్షణ : బయో మెట్రిక్ వేలిముద్ర మూడుసార్లు తీసుకుని బియ్యం తూకం వేయాల్సి వస్తుండటంతో బాగా ఆలస్యం అవుతోంది. కొన్నిచోట్ల స్టాక్ లేదంటూ మూసివేస్తుండగా మరికొన్ని చోట్ల డీలర్లు ఒక్కపూట మాత్రమే దుకాణాలు తెరుస్తున్నారని కార్డుదారులు వాపోతున్నారు. పనులన్నీ మానుకుని గంటలకొద్దీ నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దుకాణాల మధ్య ఎగబడుతున్న జనం : సన్న బియ్యం పంపిణీ పథకం కింద ఒక్కో వ్యక్తికి నెలకు 6 కిలోల చొప్పున మూడు నెలలకు కలిపి 18 కిలోల బియ్యం అందిస్తున్నారు. తెల్లవారుజామునే రేషన్ షాపుల వద్ద జనం ఎగబడుతున్నారు. కార్డుదారులను నియంత్రించేందుకు కొందరు డీలర్లు టోకెన్లు అందించి అందుకు అనుగుణంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కోసారి సాంకేతికంగా సర్వర్, నెట్‌వర్క్ సమస్యలు కార్డుదారుల సహనానికి పరీక్షపెడుతున్నాయి. కొందరికి వేలిముద్రలు సరిగా పడకపోవడం వల్ల చౌకధరల దుకాణాల చుట్టూ తిరగాల్సి వస్తోందని చెబుతున్నారు."ఇక్కడ రెండు పూటలు తీసినా బియ్యం పంపిణీ కష్టమే అలాంటిది ఒక్కపూటే తీస్తే ఎలా ఒక నెల బియ్యం ఇస్తే సమస్య ఏం లేదు. కానీ మూడు నెలలు ఇచ్చినప్పుడే సమస్య వస్తుంది" -కృష్ణమూర్తి, రేషన్ కార్డుదారు, కొత్తపేట, హైదరాబాద్ఏ నెలకు ఆ నెలా ఇస్తే : నెట్‌వర్క్ సమస్యల వల్ల ఈ-పాస్ మిషన్ కూడా సతాయిస్తోందని డీలర్లు వాపోతున్నారు. ఒకేసారి జనం ఎగబడటం వల్ల తాము ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలలకు ఒకేసారి కాకుండా ఏ నెలకు ఆ నెలా ఇస్తేనే బాగుంటుందని కొందరు డీలర్లు




# ఇళ్లకు సౌరవిద్యుత్ వేస్తే విద్యుత్ మాత్రమే కాదు

**40 శాతం రాయితీ ఇస్తున్న కేంద్రం**

**విద్యుత్ ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం అడుగులు**

**కోటి ఇళ్లకు సోలార్ పలకలను అందించాలని నిర్ణయించిన కేంద్రం**



40 శాతం రాయితీతో సోలార్ విద్యు అందించేలా పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన దేశంలోని ప్రజలకు విద్యుత్ ఖర్చులను తగ్గించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం నివాస గృహాలపై సౌర విద్యుత్తు యూనిట్లు ఇస్తోంది. ఇదే తరహాలో దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లకు సోలార్ పలకలను అందించాలని నిర్ణయించింది. దీనికి తగిన ఏర్పాట్లను కూడా పూర్తి చేసింది. దీనిలో ప్రధానంగా నెలకు 360 యూనిట్ల వరకు విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు అవకాశం కల్పిస్తోంది.యూనిట్ ఏర్పటుకు 40 శాతం రాయితీ : సాధారణంగా దీనిని ఏర్పాటు చేయాలంటే పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని ప్రతి ఒక్కరూ వెనకడుగు వేస్తారు. ఈ విషయాన్ని గ్రహించిన ప్రభుత్వం ప్రజలను సోలార్ శక్తిని ప్రోత్సహించడంలో భాగంగా ప్రతి యూటనిట్ అమర్చుకునేందుకు 40 శాతం రాయితీ ఇస్తోంది. దీనిలో భాగంగా తెలంగాణలోనూ ప్రతి జిల్లాల్లో అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ప్రచార రథాలను ప్రారంభించి అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నారు.80 చదరపు అడుగుల స్థలం చాలు : దీనిని ఏర్పాటు చేసుకునేందుకు 80 చదరపు అడుగుల స్థలం ఉంటే సరిపోతుంది. దీనిలో కిలో వాట్‌కు సరిపడ సౌర విద్యుత్తు ప్లాంటు ఏర్పాటు చేసుకోవచ్చు. దీనిని ఏర్పాటు చేసుకునేందుకు సాధారణంగా రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చు అవుతుంది. అయితే దీనిపై ప్రభుత్వం రాయితీ ఇస్తున్నందున మనకు కేవలం రూ.30 నుంచి రూ.40 వేలలోపు పని పూర్తవుతుంది. అంటే ప్రభుత్వం ఈ పథకం కింద దరఖాస్తు చేసుకున్న వారికి రూ. 30 వేల వరకు రాయితీ ఇస్తుంది. దీనిలో మనకు అనేక లాభాలున్నాయి. ముందుగా నెలకు రూ. 346 విలువైన విద్యుత్తును ఆదా చేసుకోవచ్చు.2 కిలో వాట్ల యూనిట్ ఏర్పాటు చేస్తే : అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తాం అనుకునేవారు 2 కిలో వాట్ల యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికోసం మీ వద్ద 160 చ.అ. స్థలం అందుబాటులో ఉండాలి. దీనిని పూర్తిగా ఏర్పాటు చేసుకునేందుకు రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే ప్రభుత్వం మనకు రాయితీ కల్పిస్తున్నందున కేవలం రూ.90 వేలతో పూర్తి చేసుకోవచ్చు. అనగా రూ.60 వేల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. దీనిని ఏర్పాటు చేసుకోవడంతో నెలకు రూ.1,328 విలువైన విద్యుత్తును ఆదా చేసుకోచ్చు.ఇదే రీతితో 3 కిలోవాట్ల యూనిట్‌నూ ఏర్పాటు చేసుకునే వెసులుబాటు ఉంది. దీనికోసం 240 వేల చ.అ. విస్తీర్ణం ఉంటే సరిపోతుంది. దీనిని ఏర్పాటు చేసుకునేందుకు రూ.2.10 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అయితే ప్రభుత్వం అందిస్తున్న రాయితీ కారణంగా కేవలం రూ.1.22 లక్షలకు పూర్తవుతుంది. అంటే రాయితీగా రూ.78 వేల వరకు కేంద్ర ప్రభుత్వమే భరిస్తుంది. దీనిని ఏర్పాటు చేసుకోవడం ద్వారా రూ.2,330 విలవైన విద్యుత్తును ఆదా చేసుకోవచ్చు.అర్హతలివే : దీనకోసం అప్లైచేసుకునేందుకు ఈ అర్హతలు ఉంటే సరిపోతుంది. ముందుగా మీరు భారత పౌరులై ఉండాలి. మీ ఇంటి పైకప్పుపై సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు అనువైన ప్రదేశం ఉండాలి. మీ ఇంటికి విద్యుత్ కనెక్షన్ కూడా ఉండాలి. అయితే గతంలో సౌర పలకలపై రాయితీ పొంది ఉంటే ఈ పథకానికి మీరు అర్హులు కారు.అప్లై చేసుకునే విధానం : ముందుగా అధికారిక వెబ్‌సైట్ ను సందర్శించాలి. దీనిలో మీ బ్యాంకు ఖాతా వివరాలు, మీ ఇంట్లోని విద్యుత్ బిల్లు, క్యాన్సిల్ చెక్‌తో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం మీ అప్లికేషన్‌ను డిస్కం సంస్థ పరిశీలిస్తుంది. వీలైనంత త్వరగా అనుమతి ఇస్తుంది. అనంతరం సౌర విద్యుత్‌తు పలకలు, ఇన్వర్టర్ నుంచి రీడింగ్ మీటర్ ఏర్పాటు చేస్తారు. మీకు ఇష్టం ఉంటే గ్రిడ్‌కు అనుసంధానం చేసుకోవచ్చు. అదనంగా ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు ఇస్తే మీటర్ రీడింగ్ ఆధారంగా ఉన్న వారు యూనిట్‌కు రూ.2.54 చొప్పున చెల్లిస్తారు.

# శ్రీవారి ఖజానాకు కాసుల వర్షం

**రికార్డు స్థాయిలో పెరిగిన భక్తుల దర్శనాలు**

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి క్షేత్రం 2025-26 ఆర్థిక సంవత్సరంలో అపూర్వమైన రికార్డులను నమోదు చేసింది. భక్తుల దర్శనాల నుంచి హుండీ ఆదాయం వరకు అన్ని విభాగాల్లోనూ గత రికార్డులను అధిగమించి సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. టీటీడీ పక్కా ప్రణాళిక, ఆధునిక టెక్నాలజీ వినియోగంతో ఇది సాధ్యమైంది.దర్శనం, ఆదాయంలో అపూర్వ వృద్ధిగత రెండేళ్లతో పోలిస్తే 2025-26లో శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2023-24, 2024-25 సంవత్సరాల్లో రోజుకు సగటున 70 వేల మంది స్వామివారిని దర్శించుకోగా, 2025-26లో ఈ సంఖ్య రోజుకు సగటున 73 వేలకు చేరింది. తద్వారా దర్శనాల్లో 4.57 శాతం వృద్ధి నమోదైంది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో రోజువారీ భక్తుల సంఖ్య 90 వేల నుంచి 95 వేల వరకు చేరడం విశేషం. ఈ విజయం వెనుక తిరుమలలో ఏర్పాటు చేసిన ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కీలక పాత్ర పోషించింది. దీని ద్వారా దర్శనం క్యూలైన్లు, భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ఎక్కువ మంది భక్తులకు సాఫీగా దర్శనం కల్పించేలా టీటీడీ చర్యలు తీసుకుంది.భక్తుల రద్దీ పెరగడంతో శ్రీవారి హుండీ ఆదాయం కూడా భారీగా వృద్ధి చెందింది. గతంలో కేవలం రద్దీ ఎక్కువగా ఉండే నెలల్లో మాత్రమే రూ.120 కోట్లకు పైగా ఆదాయం రాగా, 2025-26లో ఏకంగా ఆరు నెలల పాటు ప్రతినెలా రూ.120 కోట్లకు పైగా హుండీ ఆదాయం సమకూరింది. మొత్తం మీద ఈ ఏడాది హుండీ ఆదాయం రూ.1420 కోట్లు దాటింది. ఇదే సమయంలో వసతి గదుల కేటాయింపులో పార దర్శకత పాటించడం ద్వారా ఆదాయం రూ.133 కోట్ల నుంచి రూ.141 కోట్లకు పెరిగింది.లడ్డూ విక్రయాలు 13.95 కోట్లకు.. అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు 2.85 లక్షలకు ఇక శ్రీవారి లడ్డూ ప్రసాదం విక్రయాలు కూడా రికార్డు స్థాయిలో జరిగాయి. 2024-25లో 12.49 కోట్ల లడ్డూలు విక్రయించగా, 2025-26లో ఆ సంఖ్య 13.95 కోట్లకు చేరింది. మరోవైపు అన్నప్రసాద సేవలను కూడా టీటీడీ విస్తరించింది. రోజుకు సగటున అన్నప్రసాదం స్వీకరించే భక్తుల సంఖ్య 2024-25లో 2.21 లక్షలు ఉండగా, 2025-26లో 2.85 లక్షలకు పెరిగింది. మొత్తంగా మెరుగైన నిర్వహణ, భక్తుల సౌకర్యార్థం తీసుకున్న చర్యలతో తిరుమల క్షేత్రం అన్ని విధాలా సరికొత్త రికార్డులను నెలకొల్పింది.



## అవినీతి ఆరోపణలు
## దేవాదాయ శాఖ ఏసీ శాంతిపై సస్పెన్షన్ వేటు



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ (ఏసీ) కె.శాంతిపై సస్పెన్షన్ వేటు పడింది. ఆమెను సస్పెండ్ చేస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న సమాచారంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఈ నెల 6న శాంతిపై కేసు నమోదు చేశారు. 7న ఆమెకు సంబంధించిన మూడు చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ.1.37 కోట్ల విలువైన అక్రమాస్తులు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అదే రోజు ఆమెను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం ఆమెకు ఈ నెల 21 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.ఏపీ సివిల్ సర్వీస్ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి 48 గంటలకు మించి కస్టడీలో ఉంటే వారిని సస్పెండ్ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే కె.శాంతిని సస్పెండ్ చేశారు. ఆమె అరెస్టయిన ఏప్రిల్ 7వ తేదీ నుంచే ఈ సస్పెన్షన్ అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# అమరావతిపై జగన్ హెచ్చరికలు


**'మావిగన్' వెనుక ఉద్దేశం అదే ఏబీవీ**



మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి 'మావిగన్' అంటూ చేసిన వ్యాఖ్యల వెనుక ఓ హెచ్చరిక ఉందని, తాను మళ్లీ అధికారంలోకి వస్తే అమరావతిని నాశనం చేస్తానని ఇన్వెస్టర్లను భయపెట్టేందుకే అలా మాట్లాడుతున్నారని విశ్రాంత ఐపీఎస్ అధికారి, సెంటర్ ఫర్ లిబర్టీ కన్వీనర్ ఏబీ వెంకటేశ్వరరావు ఆరోపించారు. మొదటి నుంచీ జగన్ అమరావతికి వ్యతిరేకమని, రాజధానికి ఎన్ని అడ్డంకులు సృష్టించాలో అన్నీ సృష్టించారని ఆయన విమర్శించారు.విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "అమరావతికి చట్టబద్ధత కల్పించడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే 'మావిగన్' వంటి వింత వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే పత్రికలపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారు" అని ఏబీవీ దుయ్యబట్టారు. జగన్ వ్యాఖ్యలకు వైసీపీ నేతలు మద్దతు పలకడం దురదృష్టకరమని ఆయన అన్నారు.అమరావతి నిర్మాణానికి రూ.2 లక్షల కోట్లు ఖర్చవుతుందని జగన్ చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఏబీవీ తెలిపారు. ఆ మొత్తం ఎలా ఖర్చవుతుందో వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. జగన్ తన తీరు మార్చుకోకపోతే, భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.


# ఏప్రిల్ 22 వరకు భగభగే

**తెలంగాణకు వాతావరణ శాఖ హెచ్చరిక**




తెలంగాణలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారుతోందని, రానున్న పది రోజుల పాటు ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఏప్రిల్ 22వ తేదీ వరకు పలు జిల్లాల్లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ముఖ్యంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల నుంచి 44 డిగ్రీల సెల్సియస్ వరకు చేరవచ్చని అంచనా వేసింది.గత వారం రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సాధారణం కంటే 2 డిగ్రీలు అధికంగా నమోదవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రతకు తోడు వేడి, ఉక్కపోత అధికంగా ఉండటంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం నాటికే రాష్ట్రంలోని 27 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును దాటడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నల్గొండ జిల్లా ఘనపూర్‌లో అత్యధికంగా 41.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆకాశంలో మేఘాలు కనిపించినా వాతావరణంలో చల్లదనం ఉండదని, వేడిగాలులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.రాజధాని హైదరాబాద్‌లోనూ రానున్న రోజుల్లో 40 నుంచి 41 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కీలక సూచనలు చేసింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని హితవు పలికింది. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నారుల విషయంలో మరింత జాగ్రత్త అవసరమని సూచించింది. ఒకవేళ బయటకు వెళ్లాల్సి వస్తే వడదెబ్బ తగలకుండా తలపాగా, గొడుగు వంటివి వాడాలని, తరచూ నీరు, ద్రవ పదార్థాలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.

## పుట్టినరోజు నాడే అమెరికాలో బొబ్బిలి టెక్కీ మృతి



ఎంతో సంతోషంగా జరుపుకోవాల్సిన పుట్టినరోజే అతడి పాలిట చివరి రోజైంది. ఉన్నత భవిష్యత్తు కోసం అమెరికా వెళ్లిన ఆ యువ ఇంజనీర్, తన పుట్టినరోజు నాడే అనుమానాస్పద స్థితిలో మరణించాడు. కుటుంబానికి అండగా నిలుస్తాడనుకున్న కొడుకు విగతజీవిగా మారడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు దీన్ని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.వివరాల్లోకి వెళితే.. బొబ్బిలి మండలం పిరిడి గ్రామానికి చెందిన గొర్లె సాయికుమార్ (28) ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. చదువు పూర్తయ్యాక అక్కడే సాఫ్ట్ వేర్ ఇంజనీర్ ఉద్యోగం సంపాదించుకున్నాడు. దీంతో తమ కష్టాలు గట్టెక్కాయని అతడి తల్లిదండ్రులు రమ, శ్రీనివాస్ ఎంతో సంతోషించారు. అయితే, వారికి ఆ ఆనందం ఎక్కువ కాలం నిలవలేదు. ఉద్యోగంలో చేరి మూడు నెలలు మాత్రమే అయింది. ఈ క్రమంలోనే శనివారం సాయికుమార్ పుట్టిన రోజు కావడంతో రోజంతా స్నేహితులతో కలిసి సంతోషంగా గడిపాడు.ప్రమాదవశాత్తూ సాయంత్రం చెరువులో మునిగి చనిపోయాడు. కుమారుడి అకాల మరణవార్త తెలియగానే బొబ్బిలిలోని ఆయన కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చేతికి అందివచ్చిన కొడుకు ఇక లేడనే వార్త విని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి తరలించేందుకు అమెరికాలోని తెలుగు సంఘాలు, సాయికుమార్ స్నేహితులు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకుని సహాయం చేయాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు.

## పొట్లపల్లి కమల మనోహర్‌రావుపై డాక్యుమెంటరీ



పొట్లపల్లి కమల మనోహర్‌రావు డిసెంబర్ 20, 1919న జన్మించారు. స్వగ్రామం అశ్వరావుపల్లి (రఘునాథపల్లి మండలం, జనగాం జిల్లా). ఆయన నిజాం ప్రభుత్వంలోని సామాజిక సంక్షేమశాఖలో పనిచేశారు. ఆదివాసీ సమూహాల అభివృద్ధి కోసం, ప్రత్యేకంగా గిరిజన సంక్షేమశాఖ ఏర్పాటుకు కృషిచేసి సాధించారు. 1966లో గిరిజన సంక్షేమశాఖ స్థాపించినపుడు ఆయన దాని మొదటి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అప్పటి నుంచి 1975లో పదవీ విరమణ వరకు ఆదివాసీల జీవన విధానం మెరుగుపరచడం కోసం ఎంతో కృషి చేశారు. 'సింగిల్ విండో' పరిపాలనా సూత్రాన్ని ప్రవేశపెట్టిన శాస్త్రవేత్తగా గుర్తింపు పొందారు. ఆదిలాబాద్ గోండు ఆదివాసీలపై అధ్యయనం చేసిన ప్రొఫెసర్ హైమండార్ఫ్ కమల మనోహర్‌రావు సేవలను గుర్తించి, అభినందిస్తూ కొన్ని లేఖలు కూడా రాశారు. గోండులకు భూమి హక్కు, పట్టాలూ లభించడంలో కమల మనోహర్ రావు కృషి కూడా ఉంది. ఆయనపై ఒక డాక్యుమెంటరీ అధ్యయనం చేస్తున్నాం. ప్రభుత్వ అధికారిగా గిరిజన సంక్షేమానికి ఆయన చేసిన కృషికి సంబంధించిన వివరాలన్నీ సేకరించదలచుకున్నాము. ఆయనకు సంబంధించిన సమాచారం, ఆర్టికల్స్, పుస్తకాలు ఉంటే మాకు తెలియచేయాలని కోరుతున్నాం. ఆయనతో పరిచయం ఉన్నవారు ఆ జ్ఞాపకాలను పంచుకోదలిస్తే, మేమే వచ్చి ఆ వివరాలు రికార్డు చేసుకుంటాము.

## ఉదయాన్నే ఇవి తింటున్నారా.. జాగ్రత్త..



ఉదయాన్నే అల్పాహారం తినడం ఆరోగ్యానికి చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన అల్పాహారంతో మీ రోజును ప్రారంభించాలి. సరైన పోషకాలు లేని అల్పాహారం తీసుకుంటే రోజంతా అలసటగా ఉంటుంది. ఆరోగ్యంపై చెడు ప్రభావం పడుతుంది. కాబట్టి, అల్పాహారంను సమతుల్యంగా ఎంచుకోవాలి. అలా కాకుండా ఉదయాన్నే వీటిని తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

### పాలతో తృణధాన్యాలు

చాలా మంది పాలలో తృణధాన్యాలు వేసుకోని తింటుంటారు. వీటిని ఆరోగ్యానికి మంచివిగా భావిస్తారు. కానీ ఇలా తినడం మంచిది కాదు. ఎందుకంటే తృణధాన్యాలలో చక్కెర ఉంటుంది. ఇది శరీరంలో చక్కెర స్థాయిని ఒక్కసారిగా పెంచేస్తుంది. దీని వల్ల త్వరగా ఆకలేస్తుంది, అంతే కాదు దీర్ఘకాలంలో మధుమేహం వచ్చే ప్రమాదం కూడా ఉంటుంది.

### బ్రెడ్‌జి

చాలామంది బ్రెడ్ మంచిదని అల్పాహారంగా దీనిని తీసుకుంటుంటారు. కానీ, ఇది జీర్ణ సమస్యలను తెస్తుంది. బ్రెడ్ ఎక్కువగా ప్రాసెస్ చేయబడిన కార్బోహైడ్రేట్ కాబట్టి ఇది కడుపులో గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు తలెత్తేలా చేస్తుంది. పైగా దీన్ని తిన్న తర్వాత త్వరగా ఆకలేస్తుంది.


### బాగెల్స్‌జి

బాగెల్స్ కూడా ప్రాసెస్ చేసిన పిండితో తయారవుతాయి. వీటిలో ఫైబర్ లేకపోవడంతో శరీరానికి అవసరమైన పోషకాలు అందవు. అల్పాహారంగా తింటే రక్తంలో చక్కెర మితిమీరినంతగా పెరగొచ్చు. దాంతో పాటు రోజంతా మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది.

### ఫ్రూట్ జ్యూస్

చాలా మంది అల్పాహారంగా ఫ్రూట్ జ్యూసులు తీసుకుంటారు. అయితే, చాలా పండ్ల రసాల్లో చక్కెర శాతం అధికంగా ఉంటుంది. పైగా, పండ్లను రసం చేసేటప్పుడు వాటిలో ఉండే ఫైబర్ పోతుంది. ఫైబర్ లేకపోతే, జ్యూస్ తాగిన వెంటనే రక్తంలో చక్కెర పెరుగుతుంది. దీని బదులు తాజా పండ్లు తినడం మంచిది. ఆరోగ్యంగా అనిపించే ప్రతి అల్పాహారం నిజంగా మంచిదే అని అనుకోవద్దు. పోషకాలు సమతుల్యంగా ఉండేలా, జీర్ణశక్తికి అనుకూలంగా ఉండేలా అల్పాహారాన్ని ఎంచుకోవాలి. ఉదయం మీరు ఏమి తింటే అది మీ ఆరోగ్యాన్ని నిర్ధారిస్తుంది. కాబట్టి, జాగ్రత్తగా ఆలోచించి తినండి.

## వయసు పెరిగినా కంటి చూపు తగ్గకుండా ఉండాలా.. ఈ చిట్కాలు పాటించండి



వయసు పెరిగే కొద్దీ మన కంటి చూపు మందగిస్తుంటుంది. ముఖ్యంగా సమీప వస్తువులు స్పష్టంగా కనపడకపోవడం, కంటి శుక్లం , రెటీనా మధ్య భాగం దెబ్బతినడం వంటివి సాధారణంగా వృద్ధాప్యంలో వచ్చే సమస్యలు. ఇంకా మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులు కూడా కంటి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అయితే, కొన్ని అలవాట్లు పాటిస్తే వృద్ధాప్యం వచ్చినా కంటి చూపును కాపాడుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం..

### పోషకాల ఆహారం

విటమిన్ , ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు, అలాగే పోషకాలు ఉన్న ఆహారాలు కంటికి చాలా ఉపయోగపడతాయి. ఈ పోషకాలు ఆక్సిడేషన్ (శరీరంలో హాని కలిగించే ప్రాసెస్)ను తగ్గించి, రెటీనా ఆరోగ్యాన్ని కాపాడతాయి. అందుకే ఆకుకూరలు, చేపలు, క్యారెట్, గింజలు ఎక్కువగా తినడం మంచిది.

### నీరుజి

తగినంత నీరు తాగితే కళ్ళు తేమగా ఉంటాయి. ఇది డ్రై ఐ సిండ్రోమ్ (కళ్ళు ఎండిపోయి అసౌకర్యం కలిగించటం)ను తగ్గిస్తుంది. ఇది వృద్ధాప్యంలో చాలా సాధారణం. కాబట్టి, ఎక్కువగా నీరు తాగుతూ ఆరోగ్యంగా ఉండండి.

### స్క్రీన్ ఎక్కువగా చూడకండి

కంప్యూటర్, ఫోన్ స్క్రీన్ ఎక్కువగా చూస్తే కళ్ళు అలసిపోతాయి. అందుకే 20-20-20 నియమం పాటించండి. అంటే ప్రతి 20 నిమిషాలకి 20 అడుగుల దూరంలో ఉన్న దేనినైనా 20 సెకన్ల పాటు చూడండి. ఇది కంటి ఒత్తిడిని తగ్గిస్తుంది.

### వ్యాధులను నియంత్రించండి

మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులను నియంత్రించండి. ఈ వ్యాధులు కంటి రక్తనాళాలకు హాని కలిగించి చూపు కోల్పోవడానికి కారణం అవుతాయి. కాబట్టి మీ చక్కెర, రక్తపోటును తరచూ తనిఖీ చేయించుకుని డాక్టర్ చెప్పిన మందులు సరిగా తీసుకోండి.

### సరైన వెలుతురు

పుస్తకం చదవడం, పని చేయడం వంటి వాటికి తగినంత వెలుతురు ఉండాలి. తక్కువ వెలుతురులో పని చేస్తే కళ్ళ మీద ఒత్తిడి పెరుగుతుంది. కాబట్టి, వెలుతురు ఉన్న ప్లేస్‌లో పని చేయండి.

### వ్యాయామం చేయండి

శరీరం ఆరోగ్యంగా ఉండటం కంటి ఆరోగ్యానికి కూడా మంచిది. అలాగే కంటికి సంబంధించిన కొన్ని ప్రత్యేక వ్యాయామాలు కూడా చేయడం వల్ల కంటి శక్తి మెరుగుపడుతుంది. మొత్తానికి, ఈ అలవాట్లు పాటిస్తే వయసు పెరిగినా మీ కంటి చూపును దెబ్బతీయకుండా రక్షించుకోవచ్చు.

# మాంసం వినియోగంలో అమెరికా టాప్.. భారత్ చాలా వెనుక!

**మాంసం వినియోగంలో అమెరికా, ఆస్ట్రేలియా అగ్రస్థానం**

**ఏడాదికి తలసరి 110 కేజీలకు పైగా తింటున్న వైనం**


**అత్యల్పంగా మాంసం తినే దేశాల జాబితాలో భారత్**

**పేదరికం, సంస్కృతి, ఆహార అలవాట్లే ప్రధాన కారణం**

**మాంసం వినియోగం 90 శాతం తగ్గితేనే పర్యావరణానికి మేలు**


**ప్రొటీన్ల కోసం పప్పుధాన్యాలు తినాలని నిపుణుల సూచన**






ప్రపంచవ్యాప్తంగా ఆహారపు అలవాట్లు విభిన్నంగా ఉంటాయి. ముఖ్యంగా మాంసం వినియోగంలో దేశాల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ 2022 సంవత్సరానికి విడుదల చేసిన డేటా ప్రకారం, మాంసం ఎక్కువగా తినే దేశాల్లో అమెరికా, అర్జెంటీనా, ఆస్ట్రేలియా అగ్రస్థానంలో నిలిచాయి. ఈ దేశాల్లో ఒక్కో వ్యక్తి ఏడాదికి సగటున 110 కిలోలకు పైగా మాంసాన్ని వినియోగిస్తున్నట్లు 'వరల్డ్ పాపులేషన్ రివ్యూ' తన నివేదికలో పేర్కొంది. వీరితో పాటు మంగోలియా, స్పెయిన్, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో కూడా తలసరి మాంసం వినియోగం 100 కిలోల కంటే ఎక్కువగా ఉంది. ధనిక దేశాలు కావడం, స్థానిక వంటకాల్లో మాంసానికి ప్రాధాన్యత ఉండటం వంటివి ఇందుకు ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి ఆఫ్రికా, దక్షిణాసియా దేశాల్లో నెలకొంది. ఈ ప్రాంతాల్లో మాంసం ధరలు అధికంగా ఉండటం, సాంస్కృతిక కారణాల వల్ల దాని వినియోగం చాలా తక్కువగా ఉంది. 2022 సంవత్సరానికి భారత్ డేటా అందుబాటులో లేనప్పటికీ, గత గణాంకాలను పరిశీలిస్తే ఇక్కడ మాంసం వినియోగం ప్రపంచంలోనే అతి తక్కువగా ఉండే దేశాల జాబితాలో ఉంది. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, బంగ్లాదేశ్ వంటి దేశాల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. అలాగే, యుద్ధం, సరఫరా సమస్యలతో సతమతమవుతున్న సిరియా, యెమెన్, ఉత్తర కొరియా వంటి దేశాల్లో కూడా ప్రజలు మాంసానికి దూరంగా ఉంటున్నారు.అయితే, అధిక మాంసం వినియోగం పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాతావరణ మార్పులను అదుపులో ఉంచాలంటే పశ్చిమ దేశాలు తమ మాంసం వినియోగాన్ని 90 శాతం మేర తగ్గించుకోవాలని 2018లో ప్రఖ్యాత 'నేచర్' పత్రికలో ప్రచురితమైన ఒక అధ్యయనం స్పష్టం చేసింది. మాంసం ఉత్పత్తిని తగ్గించడం ద్వారా ఏర్పడే పోషకాహార లోటును భర్తీ చేసేందుకు బీన్స్, ఇతర పప్పుధాన్యాల వాడకాన్ని పెంచుకోవాలని ఆ అధ్యయనం సూచించింది. ఇది పర్యావరణ హితకరమైన ప్రోటీన్ సరఫరాకు దోహదపడుతుందని పేర్కొంది.

# వర్సిటీల ప్రక్షాళన ఇలా మొదలుకావాలి



కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో విశ్వవిద్యాలయాలను శుద్ధి చేయాలని ఆంధ్రజ్యోతిలో ఇటీవల ఒక రచయిత రాశారు. విశ్వవిద్యాలయాలకు రాజకీయ వాతావరణం కాకుండా విద్యా వాతావరణం అవసరమనేది నిజం. తదనుగుణంగా, అతిథి అధ్యాపక వ్యవస్థ ప్రక్షాళనతోనే ఆ కార్యాచరణ మొదలుకావాలి. ఒక విశ్వవిద్యాలయంలో అతిథి అధ్యాపకుల సగటు వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుంది. కొన్ని సందర్భాల్లో 55 సంవత్సరాల వరకూ ఉంటుంది. వారు దాదాపు 20 ఏళ్ల క్రితం తమ పీహెచ్‌డీలను పూర్తి చేసుకొని ఉంటారు. అయినా వారు దేశంలోని ప్రభుత్వ/ప్రైవేట్ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పదవిని పొందలేకపోయారంటే, సమర్థత కొరవడడం వల్ల, వారు రాష్ట్రం వెలుపల ఏ పదవికీ దరఖాస్తు చేసుకోలేదని భావించవచ్చు. ఇక, ఈ అతిథి అధ్యాపకులలో ఎంతమంది లేదా పరీక్షలో అర్హత సాధించారు? చాలా తక్కువ. అర్హత సాధించిన వారు కూడా అనేక ప్రయత్నాల తర్వాతే క్లియర్ చేశారు. ఉదాహరణకు 2018లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం కోసం స్క్రీనింగ్ పరీక్షను నిర్వహించినప్పుడు అతిథి అధ్యాపకులలో ఎక్కువమంది ఈ పరీక్షలో అర్హత సాధించనేలేదు. పైగా వీరిలో చాలామంది ఆంగ్లంలో ఉపన్యసించలేరు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 79 దేశాలకు చెందిన విదేశీ విద్యార్థులున్నారు. తరచుగా వారు ఈ అతిథి అధ్యాపకులు అర్థం కాని ప్రాంతీయ భాషలో తమకు బోధిస్తున్నారని వైస్ ఛాన్సలర్‌కు ఫిర్యాదులు చేశారు. అతిథి అధ్యాపకులు భారతీయ విద్యార్థులు కాపీ చేయడాన్ని ప్రోత్సహిస్తారని కూడా విదేశీ విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. ఒక విద్యార్థి కాపీ చేయడానికి సహకరిస్తూ ఒక గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యుడు పట్టుబడ్డాడు కూడా. ఈ అధ్యాపకుల్లో అత్యధికులు ఆంగ్లంలో వ్యాసం రాయలేరు, ఆంగ్లంలో పుస్తకం చదవలేరు. కొంతమంది గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులకు ఉన్నత విద్యలో మార్పు గురించి అవగాహన లేదు. వీరిలో చాలామంది దేశంలోని ఉన్నతవిద్యా సంస్థలను సందర్శించలేదు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సెమినార్ పత్రాన్ని సమర్పించలేదు. విశ్వవిద్యాలయాలలోని అతిథి అధ్యాపకులలో ఎక్కువ మంది రాజకీయ లేదా కుల కారణాల ద్వారా ప్రవేశించారు. అతి తక్కువమంది మాత్రమే అర్హతల కారణంగా విశ్వవిద్యాలయాలలో చేరారు. ఇచ్చిన మొదటి నివేదికలోని సిఫార్సులలో ఒకటి విశ్వవిద్యాలయంలో 'ఇన్ బ్రీడింగ్' తగ్గించడం. అంటే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు వంటి విశ్వవిద్యాలయ పోస్టులను రాష్ట్రం వెలుపలి వ్యక్తులతో భర్తీ చేయాలి. ఆ సిఫార్సుకు వ్యతిరేకంగా, స్థానిక వ్యక్తులనే నియమిస్తున్నారు. వాస్తవానికి, అతిథి అధ్యాపకులలో ఎవరికీ సేజ్, రౌట్లెడ్జ్, స్ప్రింగర్ వంటి అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన జర్నల్స్‌లో ప్రచురణలు లేవు. అనర్హులైన అతిథి అధ్యాపకులను తొలగించడం ద్వారా విశ్వవిద్యాలయాల ప్రక్షాళన ప్రారంభించాలి. విదేశీ విద్యార్థులను ఆకర్షించడానికి కొత్త ప్రభుత్వం విశ్వవిద్యాలయ ఉపాధ్యాయుల సమగ్ర ఎంపిక ప్రక్రియ చేపట్టాలి. ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు గత వైభవాన్ని తిరిగి పొందాలి. ముఖ్యంగా, ఆంధ్ర విశ్వవిద్యాలయం దాని వందవ సంవత్సరంలో సంస్కరణలను చేపట్టాలి. భావితరాలకు రోల్ మోడల్‌గా మారే విద్యా పదవుల్లో ప్రతిభ ఉన్న వ్యక్తులను నియమించాలి.

# బాలకార్మికతకు అంతమెప్పుడు



ఈ రోజు అంతర్జాతీయ బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేకదినం. అంటే బానిస సంకెళ్ళను తెంచుకొని, మూసిన కనురెప్పలు విప్పుకొని, రెక్కలు కట్టుకొని స్వేచ్ఛా విహంగాలై చిన్నారులు ఎగిరిపోవాల్సిన రోజు ఇది. ఈ ప్రపంచంలో అత్యంత దయనీయమైన విషయం ఏదైనా ఉందీ అంటే అది బాలకార్మిక వ్యవస్థ. రేపటి తరం అని మురుస్తున్న ఆ భవిష్యత్ తరం వేరే దిక్కులేక అన్నమో రామచంద్రా అంటూ రోడ్డున పడడం ప్రపంచంలో అన్నింటినీ మించిన విషాదం. పాపం, పుణ్యం, ప్రపంచ మార్గం ఏదీ తెలియని బాలలు మోయలేని భారాన్ని మోస్తున్నారు. పలకా బలపం పట్టాల్సిన చేతులు పత్తి చేలల్లో మగ్గిపోతున్నాయి. చెంగు చెంగున గంతులు వేయాల్సిన బాల్యం ఇటుక బట్టీల్లో మసిబారిపోతోంది. కాఫీ హెూటళ్లలో, కారా?నాల్లో, ఇంకా కాదంటే ఖరీదైన ఇళ్ళల్లో పసిబతుకులు వసివాడి పోతున్నాయి. ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా 160 మిలియన్ల మంది బాలలు బాలకార్మిక వ్యవస్థ విషవలయంలో చిక్కుకున్నారని యూనిసెఫ్ లెక్కలు తెలియజేస్తున్నాయి. దీనర్థం ప్రపంచంలోని ప్రతి పదిమందిలో ఒక పసిప్రాణం బాలకార్మిక వ్యవస్థకు బలైపోతోంది. ఇది స్వయంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిన గణాంకాలు. బాలలను శారీరకంగా, మానసికంగా, సామాజికంగా అణచివేసి, శ్రమదోపిడీకి పాల్పడుతున్న ధనిక, పెట్టుబడీదారీ వర్గం బాలకార్మిక వ్యవస్థను పెంచి పోషిస్తోంది. బట్టీల్లోనూ, గనుల్లోనూ, కారా?నాల్లోనూ, కార్యాలయాల్లోనే కాదు... చివరకు అక్రమ రవాణా ద్వారా చిన్నారులపై లైంగిక దోపిడీ కూడా సర్వసాధారణంగా మారిపోయింది. దీన్ని అడ్డుకునేందుకు అరాకొరా చర్యలే తప్ప, పూర్తిస్థాయిలో, చిత్తశుద్ధితో జరుగుతున్న పనులు చాలా తక్కువ. బాలకార్మిక వ్యవస్థకు ప్రధానమైన కారణం పేదరికం. రెక్కలు ముక్కలు చేసుకున్నా కడుపు నిండని జీవితాలు చిట్టి చేతుల చిన్నారులను పనుల్లోకి దింపుతున్నాయి. దీనికి తోడు నిరక్షరాస్యత చిన్నారులను బడులవైపు కాకుండా పనుల వైపు మళ్ళిస్తోంది. యావత్ ప్రపంచాన్ని కుదిపేస్తోన్న చైల్డ్ లేబర్ సమస్యని ప్రపంచ దేశాలు దశాబ్దాల క్రితమే గుర్తించినప్పటికీ నేటికీ ఎక్కడ వేసిన గొంగడి అక్కడనే అన్న చందంగా ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన గణాంకాలకే పరిమితమైంది. ఈ నేలపైన పుట్టిన ప్రతి బిడ్డకీ జీవించే హక్కు ఉంటుంది. బాలలకు విద్య, ఆరోగ్యం... రాజ్యాంగం కల్పించిన హక్కులు. బాలకార్మిక వ్యవస్థ చిన్నారుల ప్రతి హక్కునీ హరించివేస్తోంది. కానీ పేదరికంలో జన్మించిన ప్రతి చిన్నారికీ ఇవేవీ వర్తించడం లేదు. బాలకార్మిక నిషేధ చట్టం పనితీరు, చట్టానికి వ్యతిరేకంగా పనిచేయించుకుంటున్న వారికి వేస్తున్న శిక్షలను బట్టి అంచనా వేయవచ్చు. ఇక స్వంత కుటుంబాల్లోనే బాలకార్మికులుగా మిగిలిపోతున్నవారు మన దేశంలో కోకొల్లలు. తల్లిదండ్రులు కూలికిపోతే, బడిమానేసి, బిడ్డల సంరక్షణ చేస్తున్న చిన్నారుల సంఖ్య మనదేశ పాలకుల లెక్కలకు అందనిది. బడ్జెట్ కేటాయింపుల్లో దేశంలో సంగతి సరే, ప్రపంచవ్యాప్తంగా చూసినా సామాజిక రక్షణ నగదు ప్రయోజనాలు (సోషల్ ప్రొటెక్షన్ క్యాష్ బెనిఫిట్స్) పొందుతున్న బాలలు 26.4 శాతం మాత్రమే. ఇక పేదల ఇళ్ళు గడవని స్థితిలో ప్రభుత్వ పథకాల కోసం ఎదురుచూస్తున్న స్థితి. పేదలు బతుకు గడవని స్థితిలో తమ బిడ్డలనే బానిసలుగా మారుస్తున్నారు. దీన్ని అడ్డుకోవడానికి వారి ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచడం తప్ప మరో మార్గమే లేదు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టం చేసి చేతులు దులుపుకునే పరిస్థితి నుంచి దేశం బయటపడాలంటే బడ్జెట్ కేటాయింపులపై దృష్టి సారించాలి. అలాగే వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరుగుతూ, నైపుణ్యం లేమితో బాధపడుతున్న మన దేశంలో భవిష్యత్ తరాల చదువుకి ప్రాధాన్యత అత్యంత ఆవశ్యకం. చిన్నారులను విజ్ఞానవంతులుగా తయారుచేయడంలో తొలి అడుగు అక్షరాస్యతను పెంపొందించడం. బడుల నుంచి దూరమవుతోన్న బాలలను గుర్తించి పాఠశాలల్లోకి వారు అడుగిడే ప్రయత్నం చేయడం. నాణ్యమైన చదువుని పిల్లలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్న విషయం గుర్తించే వరకూ సమైక్యంగా పోరాడటం. ఇందుకు సుదీర్ఘ కార్యాచరణని రూపొందించుకొని ముందుకు సాగాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

# విజయవాడ నుంచి హైదరాబాద్‌కు గంటే ప్రయాణం..

## 220 కి.మీ స్పీడ్‌తో కొత్త రైలు

## .. వందే భారత్ కన్నా ఫాస్ట్..



భారతీయ రైల్వే రవాణా వ్యవస్థలో మరో విప్లవాత్మక మార్పునకు శ్రీకారం చుట్టబోతోంది. ఇప్పటికే దేశవ్యాప్తంగా విజయవంతంగా నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల కంటే వేగవంతమైన, అత్యంత అధునాతన రైళ్లను ప్రవేశపెట్టేందుకు రైల్వే బోర్డు అధికారికంగా ఆమోదం తెలిపింది. 2027-28 కోచ్ ఉత్పత్తి కార్యక్రమంలో భాగంగా గంటకు 220 కిలోమీటర్ల డిజైన్ వేగంతో ప్రయాణించే రెండు కొత్త రైలు సెట్లను తయారు చేయాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం భారతీయ రైల్వేను అంతర్జాతీయ సెమీ-హై-స్పీడ్ ప్రమాణాలకు మరింత చేరువ చేయడమే కాకుండా, దేశీయ ప్రయాణ అనుభవాన్ని పూర్తిగా మార్చివేయనుంది.ప్రస్తుతం భారతదేశంలో అత్యంత వేగవంతమైన రైలుగా గుర్తింపు పొందిన వందే భారత్ గరిష్టంగా గంటకు 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే కొత్తగా రాబోతున్న ఈ రైలు సెట్లు గంటకు 220 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రూపొందించబడతాయి, వీటి నిర్వహణ వేగం గంటకు 200 కిలోమీటర్లుగా ఉండవచ్చు. ఈ రైళ్ల తయారీ బాధ్యతను చెన్నైలోని ప్రతిష్టాత్మక ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (×జఫీ) కి అప్పగించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా ఒక్కో రైలులో 16 కోచ్‌లు ఉంటాయి. వీటిని బ్రాడ్-గేజ్ పట్టాలపై నడిచేలా అత్యాధునిక సాంకేతికతతో నిర్మిస్తారు.ఈ కొత్త రైళ్ల నిర్మాణంలో కేవలం వేగం మాత్రమే కాకుండా, ప్రయాణీకుల సౌకర్యానికి కూడా అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. అధిక వేగాన్ని తట్టుకుని, మన్నికగా ఉండేందుకు వీటిని ప్రత్యేక స్టీల్ బాడీతో రూపొందిస్తారు. రైలు మొత్తం ఎయిర్ కండిషన్డ్ చైర్ కార్ కాన్ఫిగరేషన్‌తో ఉంటుంది. ప్రయాణీకులకు విలాసవంతమైన అనుభూతిని అందించేందుకు రిక్లైనింగ్ సీట్లు, అధునాతన ఆన్‌బోర్డ్ ప్యాసింజర్ సమాచార వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌లో సంచలనం సృష్టిస్తున్న రాపిడో.. రోజుకు లక్షల రైడ్లు ఎలా సాధ్యం హైదరాబాద్‌లో సంచలనం సృష్టిస్తున్న రాపిడో.. రోజుకు లక్షల రైడ్లు ఎలా సాధ్యంఅక్టోబర్ 2024లోనే ఈ హై-స్పీడ్ రైలు సెట్ల రూపకల్పన, తయారీ కోసం ఐసిఎఫ్, బిఈఎంఎల్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ప్రాజెక్టులో ఒక్కో కోచ్ తయారీకి సుమారు 27.86 కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుందని అంచనా, దీనివల్ల మొత్తం కాంట్రాక్టు విలువ 866.87 కోట్ల రూపాయలకు చేరుకుంది. భారతీయ రైల్వే ఆధునీకరణలో భాగంగా చేపట్టిన ఈ చర్యలు రాబోయే కాలంలో ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించనున్నాయి. ప్రస్తుతం ఉన్న ట్రాక్ పరిమితుల కారణంగా దేశంలో చాలా రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల లోపు వేగంతోనే నడుస్తున్నాయి.ఈ కొత్త రైళ్ల రాకతో మౌలిక సదుపాయాలను కూడా మెరుగుపరిచే అవకాశం ఏర్పడుతుంది. వేగం, భద్రత, సౌకర్యం కలగలిసిన ఈ కొత్త రైలు సెట్లు భారతీయ రైల్వే ప్రయాణ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించబోతున్నాయి. భవిష్యత్తులో గంటకు 200 కిలోమీటర్లకు పైగా వేగంతో వెళ్లే రైళ్లను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా దేశీయ అనుసంధానాన్ని మరింత పటిష్టం చేయాలనేది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. దీనివల్ల ప్రయాణీకులకు సమయం ఆదా అవ్వడమే కాకుండా, అంతర్జాతీయ స్థాయి ప్రయాణ అనుభవం సొంతమవుతుంది.

**విజయవాడ- హైదరాబాద్ ప్రయాణం కొత్త రైలు వస్తే ఎలా ఉంటుంది..** విజయవాడ - హైదరాబాద్ మధ్య కొత్తగా రాబోతున్న గంటకు 220 కిమీ వేగంతో ప్రయాణించే రైలు అందుబాటులోకి వస్తే, ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం విజయవాడ - హైదరాబాద్ మధ్య దూరం సుమారు 310 కిలోమీటర్ల నుండి 350 కిలోమీటర్ల వరకు ఉంటుంది (తీసుకునే మార్గాన్ని బట్టి). ఒకవేళ ఈ కొత్త రైలు తన గరిష్ట నిర్వహణ వేగం అయిన గంటకు 200 కిమీ వేగంతో ప్రయాణించగలిగితే, సిద్ధాంతపరంగా ఈ ప్రయాణానికి 1 గంట 30 నిమిషాల నుండి 2 గంటల సమయం మాత్రమే పడుతుంది. అయితే, వాస్తవ పరిస్థితుల్లో వేగం పెరగడం అనేది కేవలం రైలు సామర్థ్యం మీద మాత్రమే కాకుండా, పట్టాల నాణ్యత మరియు సిగ్నలింగ్ వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది.ప్రస్తుతం మన దేశంలో ట్రాక్ పరిమితుల కారణంగా చాలా రైళ్లు గంటకు 160 కిమీ వేగంతోనే నడుస్తున్నాయి. ప్రస్తుతం అందుబాటులో ఉన్న వేగవంతమైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ విజయవాడ నుండి సికింద్రాబాద్ చేరుకోవడానికి సుమారు 4 గంటల 30 నిమిషాల నుండి 5 గంటల సమయం తీసుకుంటోంది. అంటే కొత్త హై-స్పీడ్ రైళ్లు, మెరుగుపరచబడిన ట్రాక్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే, ప్రస్తుత ప్రయాణ సమయంలో సగానికి పైగా ఆదా అయ్యే అవకాశం ఉంది.భారతీయ రైల్వే ప్రణాళికల ప్రకారం, కేవలం రైలు వేగాన్ని పెంచడమే కాకుండా, దానికి తగ్గట్టుగా పట్టాలను కూడా ఆధునీకరిస్తున్నారు. ఈ 220 కిమీ వేగంతో వెళ్లే రైళ్లు 2027-28 నాటికి పట్టాలెక్కుతాయని అంచనా. ఈ రైళ్లు అందుబాటులోకి వస్తే విజయవాడ - హైదరాబాద్ వంటి రద్దీ మార్గాల్లో ప్రయాణం విమాన ప్రయాణంతో సమానమైన వేగంతో, తక్కువ ఖర్చుతో పూర్తి చేయవచ్చు. ఇది రెండు నగరాల మధ్య వ్యాపార, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే అవకాశం ఉంది.

# ఇన్వెస్టర్లకు పండగే

## బెంగళూరులోని ఈ ప్రాంతాల్లో ఆస్తుల విలువ భారీగా జంప్!



బెంగళూరు అంటేనే ట్రాఫిక్ కష్టాలు, ఐటీ కంపెనీలు గుర్తొస్తాయి. కానీ ఇప్పుడు సిటీ ముఖచిత్రాన్ని మార్చేస్తూ 'నమ్మ మెట్రో' బ్లూ లైన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ మెట్రో లైన్ కేవలం ప్రయాణ సౌకర్యాన్ని మాత్రమే కాదు, రియల్ ఎస్టేట్ రంగంలో కూడా పెద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ , ఎయిర్‌పోర్ట్ రోడ్ పరిసరాల్లో ఆస్తుల ధరలు ఏకంగా 20 శాతం నుంచి 30 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు బ్లూ లైన్ అంటే ఏమిటి దీని ప్రత్యేకతలేంటిబ్లూ లైన్ మెట్రో అనేది దాదాపు 58.19 కిలోమీటర్ల పొడవైన భారీ కారిడార్. ఇది నగరం యొక్క దక్షిణ ప్రాంతాన్ని ఉత్తరాన ఉన్న కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంతో నేరుగా కలుపుతుంది. ఈ ప్రాజెక్టును రెండు దశల్లో పూర్తి చేస్తున్నారు.. సెంట్రల్ సిల్క్ బోర్డ్ నుంచి కె.ఆర్ పురం వరకు. కె.ఆర్ పురం నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు.సుమారు ₹15,000 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ మార్గంలో మొత్తం 29 నుంచి 32 స్టేషన్లు ఉండబోతున్నాయి.ఐటీ హబ్‌లలో పెరగనున్న డిమాండ్‌బ్లూ లైన్ ప్రధానంగా ఐటీ కంపెనీలకు నిలయమైన బెల్లందూర్ మీదుగా వెళ్తుంది. 2021లో ఇక్కడ చదరపు అడుగు ధర ₹6,800 ఉండగా, ఇప్పుడు అది ₹8,000 మార్కును దాటేసింది. హెబ్బాల్: భవిష్యత్తు ఇన్వెస్ట్‌మెంట్ జోన్లుకె.ఆర్ పురం ఇప్పుడు కేవలం ఒక ట్రాన్సిట్ స్టేషన్ మాత్రమే కాదు, ఒక మెయిన్ డెవలప్‌మెంట్ జోన్‌గా మారుతోంది. ఇక్కడ ప్రాపర్టీ ధరలు 22-30% పెరగవచ్చని మార్కెట్ వర్గాల టాక్. ఇక హెబ్బాల్ విషయానికి వస్తే, ఇది ఐటీ పార్కులకు, ఎయిర్‌పోర్ట్‌కు మధ్యలో ఉండటం వల్ల ఇక్కడ విల్లా ప్రాజెక్టులు, బిజినెస్ పార్కులు పుట్టుకొస్తున్నాయి. ఎయిర్‌పోర్ట్ దగ్గర ఉండటం, మెట్రో లైన్ తోడవడంతో భవిష్యత్తులో ఇక్కడ ఇంటర్నేషనల్ లెవల్ లాజిస్టిక్స్, వేర్‌హౌసింగ్ హబ్‌లు రానున్నాయి.మొత్తానికి బెంగళూరు మెట్రో బ్లూ లైన్ పూర్తయితే, మెట్రో స్టేషన్‌కు 500-800 మీటర్ల లోపు ఉన్న ఆస్తుల విలువ గతంతో పోలిస్తే 50% నుంచి 70% వరకు పెరిగే ఛాన్స్ ఉంది. కాబట్టి బెంగళూరులో పెట్టుబడి పెట్టాలనుకునే వారికి ఇదే సరైన సమయం!

# బంగారం ధరల పెరుగుదలపై లేటెస్ట్ రిపోర్ట్






సరికొత్త నివేదికను విడుదల చేసిన ప్రముఖ బ్యాంకులు

బంగారం మార్కెట్ ప్రస్తుతం అంతర్జాతీయ ఆర్థిక రంగంలో అత్యంత ఆసక్తికరమైన చర్చాంశంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆర్థిక సంస్థలు ఈ విలువైన లోహం భవిష్యత్తు గమనంపై భిన్నమైన, విభిన్నమైన విశ్లేషణలను వెలువరించాయి. ముఖ్యంగా 2026 రెండవ త్రైమాసికంలో బంగారం ధరలు సరికొత్త శిఖరాలను తాకుతాయని కొన్ని సంస్థలు బలంగా విశ్వసిస్తుండగా, మరికొన్ని సంస్థలు మార్కెట్‌లోని అస్థిరత గురించి హెచ్చరిస్తున్నాయి.ఈ క్రమంలో ఏఎన్‌జెడ్ విశ్లేషకులు అత్యంత సానుకూల అంచనాను వ్యక్తం చేశారు. ప్రస్తుత సంవత్సరం రెండవ త్రైమాసికం నాటికి బంగారం ధర ఔన్సుకు 5,800 డాలర్ల స్థాయిని చేరుకోవచ్చని వారు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో, జేపీ మోర్గాన్ కూడామార్కెట్ యొక్క బలాన్ని సమర్థిస్తోంది. బంగారం ధరల పెరుగుదల ఎక్కువ కాలం కొనసాగదని కొందరు చేస్తున్న వాదనలను జేపీ మోర్గాన్ తోసిపుచ్చింది; ప్రస్తుతం కొనసాగుతున్న ర్యాలీకి తగిన కారణాలు ఉన్నాయని, ఈ పెరుగుదల నిలకడగా ఉండే అవకాశం ఉందని ఆ సంస్థ విశ్లేషించింది.2026 5800 మరోవైపు, స్టేట్ స్ట్రీట్ గ్లోబల్ అడ్వైజర్స్ కూడా ధరలు 5,000 డాలర్ల మార్కును దాటడం ఖాయమని అభిప్రాయపడింది. స్వల్పకాలికంగా మార్కెట్‌లో కొన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ, భవిష్యత్ అమెరికా ద్రవ్య విధానాలు, డాలర్ విలువలో మార్పులు, పెరుగుతున్న అమెరికా ఫెడరల్ అప్పులు వంటి అంశాలు బంగారానికి సానుకూలంగా మారతాయని ఆ సంస్థ పేర్కొంది. వీటికి తోడు మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు బంగారాన్ని ఒక సురక్షితమైన పెట్టుబడిగా మరింత బలోపేతం చేస్తున్నాయి. చమురు ధరలు, ప్రపంచ ఆర్థిక వృద్ధి రేట్లు కూడా ఈ మార్కెట్‌ను ప్రభావితం చేసే కీలక అంశాలుగా మారాయి.బంగారం ధరలు మళ్లీ పెరిగాయి.. ఈ రోజు పసిడి రేటు ఎంత వరకు ర్యాలీ చేసిందంటే.. ఏప్రిల్ 11, శనివారం ధరలు ఇవే.. బంగారం ధరలు మళ్లీ పెరిగాయి.. ఈ రోజు పసిడి రేటు ఎంత వరకు ర్యాలీ చేసిందంటే.. ఏప్రిల్ 11, శనివారం ధరలు ఇవే..అయితే, మార్కెట్ నిపుణులందరూ కేవలం ధరల పెరుగుదలపైనే దృష్టి సారించడం లేదు. హెచ్‌ఎస్‌బిసి విశ్లేషకుడు స్టీల్ ప్రకారం.. 2026 సంవత్సరం పొడవునా బంగారం ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు, అస్థిరత చోటుచేసుకోవచ్చు. బంగారాన్ని ఒక రక్షణాత్మక ఆస్తిగా భావించినప్పటికీ, అది ధరల ఒడిదుడుకుల నుండి మినహాయింపు పొందదని ఆయన స్పష్టం చేశారు.అదేవిధంగా, హెరేయస్ విశ్లేషకులు అమెరికా నుండి అందుతున్న అస్పష్టమైన ఉపాధి గణాంకాలపై ఆందోళన వ్యక్తం చేశారు. సరైన ఆర్థిక డేటా అందుబాటులో లేకపోవడం వల్ల బంగారం ధరలను ఖచ్చితంగా అంచనా వేయడం పెట్టుబడిదారులకు ఒక సవాలుగా మారింది. అలాగే, పెరిగిన వెండి ధరలు మార్కెట్‌లోకి అదనపు సరఫరాను ఆకర్షిస్తున్నాయని, ఇది లోహాల మార్కెట్ గతిశీలతను మారుస్తోందని వారు పేర్కొన్నారు.బంగారం మరియు వెండి ధరలు సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో, మైనింగ్ రంగంపై పెట్టుబడి పెట్టడం ఒక తెలివైన నిర్ణయం కావచ్చని ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ సూచించింది. లోహాల ధరలలో అనిశ్చితి ఉన్నప్పటికీ, మైనింగ్ కంపెనీల స్టాక్‌లు దీర్ఘకాలంలో మంచి విలువను అందిస్తాయని ఆ సంస్థ అభిప్రాయపడింది. మొత్తంగా చూస్తే, ప్రధాన ఆర్థిక సంస్థలన్నీ ఒకే అంశంపై ఏకాభిప్రాయంతో ఉన్నాయి.అదేమిటంటే, ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో బంగారం మార్కెట్‌లో భారీ కార్యకలాపాలు సాగుతాయి. ధరలు 5,800 డాలర్ల వరకు చేరుతాయని ఇాచ్గీ వంటి సంస్థలు ఆశాభావం వ్యక్తం చేస్తుంటే, ఃూదీజ వంటి సంస్థలు మాత్రం అప్రమత్తంగా ఉండాలని, అస్థిరతకు సిద్ధపడాలని హెచ్చరిస్తున్నాయి. ఈ భిన్నమైన విశ్లేషణల మధ్య, బంగారం తన సురక్షిత ఆస్తి హోదాను నిలబెట్టుకుంటూనే పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది.డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు

## డబుల్ గేమ్ మొదలు పెట్టిన చైనా

## గగ్గోలుపెడుతున్న ట్రంప్



పశ్చిమాసియాలో శాంతి స్థాపన కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలు ప్రస్తుతం ఒక క్లిష్ట దశకు చేరుకున్నాయి. ముఖ్యంగా పాకిస్తాన్ ఆతిథ్యమిస్తున్న ఇస్లామాబాద్ చర్చలపై ప్రపంచ దేశాల దృష్టి నెలకొన్నప్పటికీ.. ఆ దేశంపై ప్రశంసల కంటే విమర్శలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. లెబనాన్‌ను ఈ కాల్పుల విరమణ పరిధిలోకి తీసుకురావడంలో విఫలం కావడం పాకిస్తాన్‌కు ఒక పెద్ద లోటుగా మారింది. ఒకవేళ ఈ చర్చలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోతే, అంతర్జాతీయ వేదికపై పాకిస్తాన్ పరపతి మరింత దెబ్బతినడం ఖాయంగా కనిపిస్తోంది. అయితే, ఈ మొత్తం వ్యవహారంలో చైనా అనుసరిస్తున్న "ద్వంద్వ వ్యూహం" ఇప్పుడు పెను సంచలనంగా మారింది.అమెరికా, ఇరాన్‌లను శాంతి చర్చల మేజా వద్దకు తీసుకువచ్చిన ఘనతను చైనా తన ఖాతాలో వేసుకున్నప్పటికీ, తెర వెనుక అది చేస్తున్న రాజకీయాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రెండు వారాల తాత్కాలిక యుద్ధ విరమణ సమయంలో ఇరు దేశాల మధ్య చర్చలు జరుగుతుండగా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాత్రం ఒప్పందం కుదరకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇప్పటికే హెచ్చరించారు. ఈ ఉత్కంఠభరిత వాతావరణంలో రహస్యంగా ఇరాన్‌కు ఆయుధాలను సరఫరా చేస్తోందని అమెరికా గూఢచార సంస్థలు సంచలన నివేదికలను వెల్లడించాయి.సీఎన్ఎన్ కథనం ప్రకారం.. చైనా త్వరలోనే ఇరాన్‌కు అధునాతన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను పంపేందుకు సిద్ధమవుతోంది. ముఖ్యంగా 'మాన్‌పాడ్స్' అని పిలిచే, భుజంపై మోసుకెళ్లి విమానాలను కూల్చివేసే యాంటీ-ఎయిర్ మిసైల్ వ్యవస్థలను ఇరాన్‌కు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ రవాణా నేరుగా కాకుండా, ఇరు దేశాలకు సన్నిహితంగా ఉండే మూడవ దేశం ద్వారా రహస్యంగా జరగవచ్చని ఇంటెలిజెన్స్ సమాచారం సూచిస్తోంది. ఒకవైపు ప్రపంచానికి శాంతి దూతగా కనిపిస్తూనే, మరోవైపు యుద్ధానికి అవసరమైన సామాగ్రిని సరఫరా చేయడం చైనా అనుసరిస్తున్న డబుల్ గేమ్‌కు నిదర్శనమని భావిస్తోంది.చైనాతో రహస్యంగా జతకట్టిన ఇరాన్.. అమెరికాకు బిగ్ షాక్..హోర్ముజ్ జలసంధి వేదికగా డాలర్ ఆధిపత్యానికి చెక్..చైనాతో రహస్యంగా జతకట్టిన ఇరాన్.. దీనిని "యాక్సిస్ ఆఫ్ ఆటోక్రసీ" వ్యూహంలో భాగంగా చూడవచ్చు. రష్యా, ఉత్తర కొరియా, ఇరాన్ వంటి దేశాలతో తన బంధాన్ని బలోపేతం చేసుకోవడం ద్వారా అమెరికా యొక్క ప్రపంచ ఆధిపత్యాన్ని సవాల్ చేయడమే చైనా అసలు లక్ష్యం.అంతేకాకుండా, హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధించడం చైనా ఆర్థిక ప్రయోజనాలకు అత్యంత కీలకం. అందుకే బహిరంగంగా శాంతి మంతరాలు పఠిస్తూ, రహస్యంగా సైనిక సహాయం అందిస్తూ రెండు వైపులా లాభపడాలని బీజింగ్ భావిస్తోంది.అయితే, ఈ ఆరోపణలను వాషింగ్టన్‌లోని చైనా దౌత్య కార్యాలయం తీవ్రంగా ఖండించింది. తాము ఏనాడూ ఏ పక్షానికీ ఆయుధాలు సరఫరా చేయలేదని, అమెరికా ఇంటెలిజెన్స్ నివేదికలు "అసత్యం" అని కొట్టిపారేసింది. ఈ దౌత్యపరమైన వాదోపవాదాల మధ్య, ఇస్లామాబాద్ చర్చలు సఫలమై శాంతి వర్ధిల్లుతుందా లేక చైనా రహస్య వ్యూహాల వల్ల మళ్ళీ యుద్ధ జ్వాలలు ఎగిసిపడతాయా అన్నది వేచి చూడాల్సిందే.

# సున్నా నుంచి కోట్లు సంపాదించడం ఎలా





చండీగఢ్‌లో ' వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసారి మన లోకల్ సక్సెస్ స్టోరీలకే ఈ ఈవెంట్ పెద్దపీట వేసింది. ముఖ్యంగా ఉత్తర భారతదేశానికి చెందిన ఎంతోమంది స్టార్టప్ ఫౌండర్లు తమ అనుభవాలను ఇక్కడ పంచుకుంటున్నారు. చిన్నపాటి సైడ్ ప్రాజెక్టులతో ప్రయాణాన్ని మొదలుపెట్టి, కోట్లాది రూపాయల టర్నోవర్ సాధించే స్థాయికి ఎలా ఎదిగారో వివరిస్తూ.. కొత్త ఎంటర్‌ప్రెన్యూర్లకు పక్కా గైడెన్స్ ఇస్తున్నారు.సున్నా నుంచి వందకు ఎలా చేరుకోవాలో ఈ ఈవెంట్ ద్వారా తెలుసుకోవచ్చు. కేవలం రూ. 50 వేల పెట్టుబడితో ప్రయాణాన్ని మొదలుపెట్టిన ఎంతోమంది లీడర్లు ఇక్కడ తమ కథనాలను పంచుకున్నారు. పట్టుదల, సరైన నిర్ణయాలతో చిన్న ఐడియాలను లాభదాయకమైన వ్యాపారాలుగా ఎలా మార్చుకోవచ్చో వారు నిరూపించారు. కొత్తగా బిజినెస్ స్టార్ట్ చేయాలనుకునే వారికి వీరి సలహాలు ఒక పక్కా రోడ్ మ్యాప్‌లా ఉపయోగపడతాయి.బిజినెస్ గ్రోత్ సీక్రెట్స్: ౧ఱజుజూచీ చండీగఢ్‌లో ఫౌండర్ల సక్సెస్ మంత్రాలుమొదటి వంద మంది కస్టమర్లను ఎలా సంపాదించాలనేది ఈ ఈవెంట్‌లో ప్రధానంగా చర్చకు వచ్చింది. భారీ మార్కెటింగ్ ఖర్చులు లేదా పెద్ద పెద్ద ఫండింగ్‌ల మీద ఆధారపడకుండా.. కేవలం మౌత్ టాక్, డైరెక్ట్ కాంటాక్ట్స్ ద్వారా బిజినెస్‌ను ఎలా వేగంగా పెంచుకోవచ్చో ఫౌండర్లు వివరించారు. వ్యాపారం ప్రారంభ దశలో ఉన్నప్పుడు ఇలాంటి చిన్న చిన్న టెక్నిక్స్‌తోనే అద్భుతాలు చేయవచ్చని వారు సూచించారు.వ్యాపార దశపెట్టుబడి వ్యూహం ప్రధాన లక్ష్యంప్రారంభ దశ (సీడ్) ₹50 వేల సొంత పొదుపు ప్రొడక్ట్ మార్కెట్ ఫిట్‌తొలి దశ వృద్ధి
లాభాలు మరియు బూట్‌స్ట్రాపింగ్‌ఆదాయం పెంచుకోవడం మార్కెట్ విస్తరణఅంతర్గత నిధులుమార్కెట్ విస్తరణసక్సెస్ కావాలంటే ఎప్పుడూ భారీ ఫండింగ్ ఉండాల్సిన అవసరం లేదని ఈ విజయగాథలు నిరూపిస్తున్నాయి. చండీగఢ్‌లోని ఎన్నో లాభదాయకమైన కంపెనీలు ఇంట్లోనే చిన్న సైడ్ బిజినెస్‌లుగా మొదలైనవే. ఖర్చులను అదుపులో ఉంచుకుంటూ, తెలివైన ప్లానింగ్‌తో వీరు తక్కువ కాలంలోనే భారీ ఆదాయ మైలురాళ్లను అందుకున్నారు. డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేయడం కంటే, పద్ధతిగా ఎదగడమే మేలని వీరు నిరూపించారు. చండీగఢ్ వ్యూహాలతో బిజినెస్ విస్తరణఈ ఈవెంట్‌లో నెట్‌వర్కింగ్ అనేది చాలా కీలకంగా మారింది. యువ ఫౌండర్లు లాభాల బాటలో ఎలా నడవాలో మెంటార్లు గైడెన్స్ ఇస్తున్నారు. అనవసర ఖర్చులు తగ్గించుకుంటూ, కస్టమర్ల అవసరాలపైనే దృష్టి పెట్టాలని వారు నొక్కి చెబుతున్నారు. మార్కెట్ పరిస్థితులు ఎలా ఉన్నా చిన్న వ్యాపారాలు నిలదొక్కుకోవడానికి ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతుంది.మొదటి రోజు ముగింపులో నేటి తరం ఎంటర్‌ప్రెన్యూర్లకు ఒక బలమైన సందేశం లభించింది. ప్రతిరోజూ చిన్న చిన్న అడుగులు వేస్తూ స్థిరంగా ముందుకు సాగితే విజయం ఖాయమని ఈ వేదిక చాటిచెప్పింది. కొత్తగా బిజినెస్ మొదలుపెట్టేవారు ఈ సలహాలను పాటిస్తూ తమ ప్రయాణాన్ని ప్రారంభించవచ్చు. ఇలాంటి ప్రాక్టికల్ ఐడియాలతో భారతీయ స్టార్టప్‌ల భవిష్యత్తు ఎంతో ఆశాజనకంగా కనిపిస్తోంది.

# చర్చలు విఫలం

## ఏం జరగబోతోందనే టెన్షన్ లో పశ్చిమాసియా




పశ్చిమాసియాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికా, ఇరాన్ మధ్య జరిగిన సుదీర్ఘ శాంతి చర్చలు విఫలమయ్యాయి. పాకిస్థాన్ లోని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇరాన్ స్పీకర్ ఘాలిబాఫ్ బృందాల మధ్య 21 గంటల పాటు చర్చలు జరిగాయి. అయితే, ఎలాంటి ఒప్పందం కుదరకుండానే అర్ధాంతరంగా ముగిశాయి. పశ్చిమాసియాలో 14 రోజులుగా అమలవుతున్న కాల్పుల విరమణ గడువు ముగియడానికి కొన్ని గంటల ముందే ఈ పరిణామం చోటుచేసుకోవడంతో, ఇప్పుడు ఏం జరగబోతోందన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.మూడు ఆప్షన్ లు..చర్చలు విఫలమవడంతో మూడు ప్రధాన పరిణామాలు చోటుచేసుకోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మొదటిది.. కాల్పుల విరమణ ముగిసిన వెంటనే మళ్లీ యుద్ధం ప్రారంభం కావడం. ఇప్పటికే ఇరాన్ తన క్షిపణులను సిద్ధం చేసుకుందన్న సమాచారంతో అమెరికా, ఇజ్రాయెల్ బలగాలు అప్రమత్తమయ్యాయి. ఇది ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసే ప్రమాదం ఉంది.పట్టువీడని ఇరు దేశాలు..చర్చల సందర్భంగా తమపై విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని ఇరాన్ పట్టుబట్టగా, హోర్ముజ్ జలసంధిలో స్వేచ్ఛాయుత రవాణాకు హామీ ఇవ్వడంతో పాటు చైనా నుంచి ఆయుధాలు తీసుకోవడం ఆపాలని అమెరికా షరతు విధించింది. తమ తమ డిమాండ్ల విషయంలో రెండు దేశాలు వెనక్కి తగ్గకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. శాంతి ప్రయత్నాలు బెడిసికొట్టడంతో ఇప్పుడు అందరి దృష్టి కాల్పుల విరమణ తర్వాత పశ్చిమాసియాలో జరగబోయే పరిణామాలపైనే కేంద్రీకృతమై ఉంది.



వైష్ణవి చైతన్య టైమ్‌లెస్ ఎత్నిక్ లుక్‌లో గాంభీర్యాన్ని పునర్ని ర్వచించింది

# దిశా పటానీ అందాలకు సోషల్ మీడియాలో క్రేజ్.. ఫ్యాన్స్ ఫిదా



బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తన గ్లామరస్ లుక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తెలుగులో 'లోఫర్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, రీసెంట్‌గా 'కల్కి 2898 ఏడీ'లో ప్రభాస్ సరసన మెరిసిన ఈ భామ, అటు సినిమాలతోనూ ఇటు హాట్ ఫోటోషూట్‌లతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా దిశా పోస్ట్ చేసిన మైండ్ బ్లాక్ అయ్యే పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఆమె అందచందాలకు నెటిజన్లు ఫిదా అవుతూ లైకులు, కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం ..

**టాలీవుడ్ ఎంట్రీ నుండి పాన్ ఇండియా స్టార్ వరకు :**

వరుణ్ తేజ్ నటించిన 'లోఫర్' సినిమాతో దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే తన క్యూట్ అండ్ హాట్ లుక్స్‌తో కుర్రాళ్ల మనసు దోచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'కల్కి 2898 ఏడీ'లో నటించి మరోసారి టాలీవుడ్ వెండితెరపై మెరిసింది.ఇక సూర్య కంగువ మూవీ లో నటించి మెప్పించింది.ఇక గ్లోబల్ లెవల్ ప్రాజెక్టుల్లో భాగమవుతూ తన క్రేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తోంది.


**సోషల్ మీడియాలో గ్లామర్ విందు:**

దిశా పటానీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎప్పటికప్పుడు తన ఫిట్‌నెస్ వీడియోలను, గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో మెరిసే డ్రెస్ వేసుకుని, తన ఎద అందాలతో కుర్రాళ్లకు మెంటలెక్కించేలా స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలు చూసిన వారెవరైనా దిశా అందానికి దాసోహం అనాల్సిందే. నెట్టింట మంటలు పుట్టించడంలో ఈమె రూటే సెపరేట్ అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

**బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్.. స్పెషల్ షోలతో బిజీ:**

కేవలం సినిమాలే కాకుండా, దిశా పటానీ టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కోట్లు గడిస్తోంది. ఫిట్‌నెస్ ఫ్రీక్ కావడంతో స్పోర్ట్స్ వేర్ మరియు ఫ్యాషన్ బ్రాండ్ల ప్రకటనల్లో ఈమెకు డిమాండ్ ఎక్కువగా ఉంది. అలాగే పలు స్పెషల్ షోలు, ఈవెంట్లలో తన డాన్స్ పర్ఫార్మెన్స్‌తో స్టేజ్‌పై నిప్పులు చెరుగుతుంది. ఇక బాలీవుడ్ టాప్ హీరోల సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ షోతో తన పాపులారిటీ తగ్గకుండా జాగ్రత్త పడుతోంది. మొత్తానికి దిశా పటానీ అటు వెండితెరపై, ఇటు సోషల్ మీడియాలోనూ తన హవా కొనసాగిస్తోంది. నటనతో పాటు తన పర్ఫెక్ట్ ఫిజిక్‌తో యూత్ ఐకాన్‌గా మారింది. ప్రస్తుతం చేతిలో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్న ఈ భామ, రాబోయే రోజుల్లో ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఇక ఏదేమైనా దిశా పటానీ అప్‌డేట్ వచ్చిందంటే చాలు, నెటిజన్లు ఆ ఫోటోలపై ఒక లుక్కేయకుండా ఉండలేరు. ఈ బాలీవుడ్ భామ అందాలకు ఫిదా అవ్వని వారుండరంటే అతిశయోక్తి కాదు!

# పల్లె బాట పట్టిన యంగ్ స్టార్స్!



త్రిధా చౌదరి నీలి రంగులో చక్కదనాన్ని పునర్నిర్వచిం చింది



ఓవైపు తెలుగు సినిమా పాన్ ఇండియాలో సంచలనం సృష్టిస్తుంటే మరికొంత మంది నవతరం మేకర్స్ గ్రామీణ నేపథ్యంగల సినిమాల ట్రెండ్ ను అంతకంతకు పెంచుతున్నారు. ఒకప్పుడు పల్లెటూరి కథలంటే కేవలం సెంటిమెంట్‌కే పరిమితం అనుకునేవారు. కానీ ఇప్పుడు అవే కథలు బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తున్నాయి. ఇటీవల విడుదలైన రాజు వెడ్స్ రాంబాయి ఘనవిజయం సాధించడం ఈ మార్పుకు నిదర్శనం. అంతకు ముందు రిలీజ్ అయిన బలగం గొప్ప చిత్రంగా నిలిచిన సంగతి తెలిసిందే. నేటి యువ తరం హీరోలు , దర్శకులు విదేశీ లోకేషన్ల కంటే పచ్చని పల్లెటూరి పొలాలనే తమ కథా వేదికలుగా ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలోనే మాస్ మహారాజా రవితేజ తమ్ముడి కుమారుడు మాధవ్ భూపతిరాజు తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యారు. మాధవ్ నటిస్తోన్న మారెమ్మ చిత్రం తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో రూపొందుతోంది. పూర్తి స్థాయి రా అండ్ రస్టిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాపై ట్రేడ్ వర్గాల్లో మంచి అంచనాలు ఉన్నాయి. కొత్త హీరోలు తమను తాము నిరూపించుకోవడానికి ఇమేజ్ చట్రంలో ఇరుక్కోకుండా ఇలాంటి సహజసిద్ధమైన పాత్రలను ఎంచుకోవడం సానుకూల పరిణామం. మరోవైపు బలగం సినిమాతో పల్లెటూరి ఎమోషన్స్‌ను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పిన దర్శకుడు వేణు ఎల్దండి తదుపరి చిత్రం ఎల్లమ్మ-పై దృష్టి సారించాడు. దేవి శ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమా కూడా గ్రామీణ సంస్కృతి , ఆచారాల చుట్టూ తిరిగే కథతో వస్తోంది. -బలగం అందించిన స్ఫూర్తితో వేణు ఈసారి మరింత లోతైన భావోద్వేగాలను, పల్లెటూరి జీవన విధానాన్ని వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ చిత్రానికి అదనపు బలాన్ని ఇవ్వనుంది.యువ హీరో కిరణ్ అబ్బవరం సైతం తన పంథాను మార్చి గ్రామీణ కథల వైపు మొగ్గు చూపుతున్నాడు. ఆయన నటిస్తూ నిర్మిస్తోన్న చిత్రం తిమ్మరాజుపల్లి అనే చిత్రం ఏప్రిల్ 17న విడుదలవుతుంది. ఈ సినిమా పూర్తిగా రూరల్ సెటప్‌లో సాగే సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఉండబోతోంది. కిరణ్ అబ్బవరం గత చిత్రాల్లో పల్లెటూరి అబ్బాయిగా మెప్పించి నప్పటికీ ఈ చిత్రం ఆయన కెరీర్‌లో విభిన్నమైన మలుపు కానుందని విశ్లేషకులు భావిస్తున్నారు. పల్లెల్లో ఉండే రాజకీయాలు , సామాజిక అంశాలను ఇందులో స్పృశించినట్లు తెలుస్తోంది.

గ్రామీణ చిత్రాలకు ఆదరణ పెరగడానికి ప్రధాన కారణం అందులో ఉండే సహజత్వం. నగర జీవితంలోని యాంత్రికతకు దూరంగా, స్వచ్ఛమైన అనుబంధాలు, పల్లెటూరి చిలిపి పనులు ,మట్టి మనుషుల కథలు ప్రేక్షకులకు త్వరగా కనెక్ట్ అవుతున్నాయి. బలగం, కేర్ ఆఫ్ కంచరపాలెం వంటి చిన్న చిత్రాలు పెద్ద విజయాలు సాధించడం చూసాక యంగ్ స్టార్స్ కూడా తమ కంఫర్ట్ జోన్ దాటి మరీ పల్లెటూరి వాతావరణంలోకి వెళ్తున్నారు. ఇది కంటెంట్ పరంగానే కాకుండా బడ్జెట్ పరంగా కూడా నిర్మాతలకు గిట్టుబాటు అయ్యే అంశం.ఆ రకంగా పల్లెటూరి కథల ట్రెండ్ టాలీవుడ్‌లో సరికొత్త ఊపిరి పోస్తోంది. భారీ గ్రాఫిక్స్ కంటే బలమైన కథలు, మట్టి వాసన ఉన్న పాత్రలే సినిమాను గట్టెక్కి స్తాయని యంగ్ స్టార్స్ నిరూపిస్తున్నారు. మాధవ్, వేణు, కిరణ్ అబ్బవరం వంటి వారు తీసుకొస్తున్న ఈ రూరల్ డ్రామాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభావాన్ని చూపుతాయో చూడాలి. ఏదేమైనా? తెలుగు సినిమా మళ్లీ రూట్స్ వెతుక్కుంటూ గ్రామాల వైపు వెళ్లడం శుభపరిణామంగా చెప్పొచ్చు.

PRINTED, PUBLISHED AND OWNER BY B.JAVEED BASHA Printed at M/S Aliya Publication, #7/235 - A Maniyar Street,Near Main Bazar, Tadipatri - 515411,Anantapur District Andra Pradesh, Published at M/S Aliya Publication, #7/235-A Maniyar Street,Near Main Bazar Tadipatri - 515411 ,Anantapur District,Andra Pradesh - 515411 EDITOR B.JAVEED BASHA RNI. NO : APTEL/2022/90211, Cell : 83339 79192 , 83339 75354 , E-mail : akshratimes@gmail.com